సాక్షి 24|7

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం 23-8-2017

ఇక టీడీపీ వంతు

- అధికార పార్టీ ముఖ్య నేతల అనుచరులే కీలక బుకీలు
- బాలయ్య సభకు బ్రహ్మానాయుడు వసూళ్లు
- నుడా చైర్మన్ కోటంరెడ్డికి ముఖ్య అనుచరుడు
- పరారీలోనే మంత్రి సోమిరెడ్డి ముఖ్య అనుచరుడు శరత్‌చంద్ర
- కృష్ణసింగ్ మొబైల్ డేటాలో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల నంబర్లు
- కృష్ణసింగ్‌తో టీడీపీ కీలక నేతకు భాగస్వామ్యం
- విచారణకు హాజరైన నగర, రూరల్ ఎమ్మెల్యేలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు :

జిల్లాలో సంచలనాత్మకంగా మారిన క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం తెలుగుదేశం పార్టీకి చుట్టుకుంది. బుకీల ఆర్థిక మూలాలు, రాజకీయ పార్టీలతో లింకులపై పోలీస్ విచారణ వేగంగా సాగుతోంది. ఈ క్రమంలో కొందరు

- మిగతా 2లో..

కుమార్తెపై కన్నతండ్రి అఘాయిత్యం

గర్భం దాల్చిన మైనర్ బాలిక

3లో

ఐటీ దడ

లెక్కలు చూపని వారికి నోటీసులు

6లో

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | బుధవారం | ఆగస్టు | 23 | 2017 సాక్షి

ఇక టీడీపీ వంతు

▶ మొదటి పేజీ తరువాయి

కీలక టీడీపీ నేతలుకూ పోలీసుల నుంచి కబురు వచ్చే అవకాశం ఉంది. అధికార పార్టీ ఇటీవల కాలంలో నిర్వహించిన భారీ కార్యక్రమాలు, కీలక నేతల అనుచరులే బుకీలుగా బెట్టింగ్ రాకెట్ నిర్వహిస్తున్న వైనం వంటి ఒక్కొక్క అంశం వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా టీడీపీకి చెందిన మంత్రుల నుంచి మాజీ ఎమ్మెల్యేల వరకు ఎక్కువ మందికి బుకీలతో పరిచయాలతోపాటు ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.

ఎమ్మెల్యేలను విచారించిన ఏఎస్పీ

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఏఎస్పీ శరత్‌బాబు మంగళవారం ప్రశ్నించారు. మొదట కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని 2.10 గంటలపాటు విచారించారు. ఆ తర్వాత అనిల్‌కుమార్ యాదవ్‌ను విచారించి.. అవసరమైతే ఈనెల 2న మరోసారి విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని సూచించారు. విచారణ అనంతరం ఎమ్మెల్యేలిద్దరూ మీడియాతో మాట్లాడుతూ తమకు కృష్ణసింగ్‌తో సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు గాని లేవని చెప్పారు. విచారణకు ఎన్నిసార్లయినా హాజరవుతామని స్పష్టం చేశారు. తాజా పరి ణామాల క్రమంలో టీడీపీ నేతలపై పోలీసుల దృష్టి మరలినట్టు తెలు స్తోంది. ఇప్పటికే 15 రోజులపాటు బుకీలను విచారించిన తర్వాత అరెస్ట్ చేశారు. ఆ తర్వాత మళ్లీ నాలుగు రోజులపాటు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఈ క్రమంలో బుకీలు తమకు రాజకీయ నేతలతో ఉన్న లింకులు, వారితో ఆర్థిక వ్యవహారాలు, కీలక కార్యక్రమాలకు ఖర్చు చేయడం వంటి వివరాలన్నిటినీ పోలీసులకు రాతపూర్వకంగా ఇచ్చారు. వాటిని ప్రామాణికంగా తీసుకుని పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఎల్‌ఎస్‌ఆర్‌పై ఆరా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను విచారించిన క్రమంలో కీలక బుకీ కృష్ణసింగ్‌తో ఉన్న పరిచయాలు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఎన్నిక సందర్భంగా గోవాలో నిర్వహించిన క్యాంపునకు కృష్ణసింగ్ ఆర్థిక తోడ్పాటు అందించడం, లేబూరు శ్రీనివాసులురెడ్డి (ఎల్‌ఎస్‌ఆర్) కార్యాలయంతో సంబంధాలు వంటి విషయాలను ఏఎస్పీ ఆరా తీశారు. లేబూరు శ్రీనివాసులురెడ్డికి అన్ని రాజకీయ పార్టీలతో మంచి పరిచయాలు ఉన్న విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏఎస్పీకి వివరించారు. టీడీపీ ముఖ్యులైన మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైవీ రామిరెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడుతోపాటు అనేక మంది తరచూ ఎల్‌ఎస్‌ఆర్ ఆఫీసుకు వస్తుంటారని ఆయన తెలిపారు. ఎల్‌ఎస్‌ఆర్ తన చిన్ననాటి స్నేహితుడు కావడంతో వ్యక్తిగతంగానే అప్పుడప్పుడూ కలుస్తానని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విచారణలో పోలీసులకు తెలిపారు.

కీలక నిందితుల్లో ఏడుగురు టీడీపీ నేతలే

తెలుగుదేశం పార్టీని బెట్టింగ్‌ల వ్యవహారం గడగడలాడిస్తోంది. ఇప్పటికే అరెస్టైన వారిలో ఏడుగురు టీడీపీ నేతలు కావడం, వారు ముఖ్యనేతలకు అనుచరులుగా ఉండటంతో విచారణ పర్వంలో ఇక టీడీపీ వంతు మొదలు కాబోతోందనే ప్రచారం సాగుతోంది. కావలిలో కీలక బుకీగా ఉన్న గుర్రం వెంకటేశ్వరరావు (జీవీ) జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు ముఖ్య అనుచరుడు. పోలీసు పరమైన సాయం పొందడమే కాకుండా రవిచంద్రకు సంబంధించిన అన్ని పనులు జీవీ చూస్తాడనే ప్రచారం బలంగా ఉంది. అలాగే కొండూరు అనిల్ సైతం రవిచంద్ర అనుచరుడే. మరో కీలక బుకీ బ్రహ్మనాయుడు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ముఖ్య అనుచరుడు. అతనికి గతంలో నగర తెలుగు యువత అధ్యక్ష పదవి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సిఫార్సుతోనే వచ్చింది. జూన్ 30న శ్రీనివాసులురెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బ్రహ్మనాయుడు భారీగా ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ హాజరైన ఈ సభకు కీలక బుకీ పొదలకూరు శ్యామ్ ప్రసాద్ మరికొందరు బుకీల నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి బ్రహ్మనాయుడు ద్వారా సభ ఏర్పాట్ల కోసం ఖర్చు చేశారు. ఇదిలావుంటే.. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన కీలక బుకీ గోళ్ల అరుణ్ మంత్రి పి.నారాయణకు సన్నిహితుడైన పట్టాభి రామిరెడ్డికి ముఖ్య అనుచరుడు. అరుణ్ అరెస్ట్ సమయంలోనే సిఫార్సులు పెద్ద ఎత్తున నడిచాయి. మరో కీలక బుకీ షంషీర్ కూడా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనుచరుడే. షంషీర్ 2014లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో 41వ డివిజన్ టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేశాడనే ప్రచారం ఉంది. ఇప్పటికీ పరారీలోనే ఉన్న మాజీ కౌన్సిలర్, కీలక బుకీ దువ్వూరు శరత్‌చంద్ర (చర), అతని కుమారుడు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ముఖ్య అనుచరులు. ప్రస్తుతం నాన్‌బెయిల్‌బుల్ కేసులో అరెస్ట్ అయిన బ్రహ్మనాయుడు, గుర్రం వెంకటేశ్వరరావు, షంషీర్, అరుణ్ వెల్లడించిన విషయాల ఆధారంగా బెట్టింగ్ వ్యవహారాల్లో టీడీపీ నేతల పాత్ర ఉన్నట్టు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఆ దిశగా ఆధారాల కోసం అన్వేషణ సాగుతోంది.

రద్దీని బట్టీ ఉపాధ్యాయుల సర్దుబాటు

- డీఈఓ రామలింగం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రామలింగం

నెల్లూరు(అర్బన్): పాఠశాలల్లో ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలకు అవసరాన్ని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని డీఈఓ మువ్వా రామలింగం తెలిపారు. వివిధ అంశాలపై అన్ని మండలాల ఎంఈఓలు, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ హాల్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి 3,250 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉన్న పాఠశాల నిర్వహణ నిధులను వెచ్చించి వెంటనే గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈ నెల 29వ తేదీలోపు ప్రతి మండలాలనికి ఇద్దరు ఉపాధ్యాయులను కమిటీ ద్వారా నామినేట్ చేయాలని కోరారు. సెప్టెంబర్ 5వ తేదీన అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలను సెప్టెంబర్ 1నుంచి 15వ తేదీ వరకు పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు యజ్దాని బాషా, రవీంద్రయ్య, ఇస్మాయిల్, సర్వశిక్ష అభియాన్ సెక్టోరల్ అధికారులు, ఎంఈఓలు పాల్గొన్నారు.



ఓజిలి : కామంతో కళ్లు మూసుకుపోయిన తండ్రి కన్న కూతురిపై వరుస అఘాయిత్యాలకు పాల్పడిన ఘటన మండలంలోని కుందాం గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. దీంతో ఆ మైనర్ బాలిక గర్భం

కూతురిపై కన్నతండ్రి అఘాయిత్యం

• గర్భం దాల్చిన మైనర్

దాల్చింది. వివరాల్లోకి వెళితే.. కుందాం గ్రామానికి చెందిన జడల అంకమ్మకి నాయుడుపేట మండలం మేనకూరు ఎస్టీ కాలనీకి చెందిన అంకయ్యతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో అంకమ్మ కొన్నేళ్ల క్రితం భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో అంకయ్య మరో మహిళతో సహజీవనం ప్రారంభించాడు. అతని వేధింపులు తాళలేక ఆమె కూడా అతణ్ణి వదిలి వెళ్లిపోయింది. ఇదిలా ఉంటే.. అంకయ్య పెద్ద కుమార్తెకు వివాహం కాగా.. మైనర్ అయిన రెండో కుమార్తె అతని వద్దే ఉంటోంది. కామంతో కళ్లు మూసుకుపోయిన అంకయ్య రెండో కుమార్తెను ఇంట్లో నిర్బంధించి తరచూ అఘాయిత్యానికి పాల్పడుతుండేవాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరిస్తుండటంతో అన్యాయాన్ని ఎవరికీ చెప్పుకోలేక ఆ బాలిక మిన్నకుండిపోయింది. కొన్ని రోజులుగా కడుపు నొప్పి వస్తుండటంతో ఆ బాలిక తండ్రి నుంచి తప్పించుకుని తల్లి వద్దకు పారిపోయింది. జరిగిన విషయం తల్లికి చెప్పగా.. ఆమె కూతురిని వజ్జావారిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లింది. బాలికను పరీక్షించిన వైద్యులు నాలుగు నెలల గర్భిణి అని నిర్ధారించారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాలికను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మకు అప్పగించారు.

నకిలీ వే బిల్లుల కేసులో ముగ్గురి అరెస్ట్

చిల్లకూరు: నకిలీ వే బిల్లుల కేసులో మరో ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. తీర ప్రాంతంలోని రెండు సిలికా మైన్ల నుంచి నకిలీ వే బిల్లుల ద్వారా ఇతర ప్రాంతాలకు సిలికాను తరలించిన ముఠాపై ఎస్‌ఐ అంకమ్మ దాడులు నిర్వహించి, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినప్పటికీ అసలు సూత్రధారి తులసిరెడ్డి ఇప్పటికీ పరారీలోనే ఉన్నాడు. అరెస్ట్ అయిన వారిలోని మురళీ అనే యువకుడిని పోలీసులు కస్టడికి తీసుకుని విచారించడంతో మరో ముగ్గురికి ఈ కేసులో సంబంధం ఉన్నట్లు తెలిసింది. దీంతో నెల్లూరు సిటీకి చెందిన పవిరి మహేష్, వెంకటాచలం వడ్డిపాళేనికి చెందిన తురకా అంకయ్య, నెల్లూరు పెద్దాసుపత్రికి సమీపంలోని శీలం రోహిణి కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరుచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

• బంగారు ఆభరణాలు స్వాధీనం
• రిమాండ్‌కు తరలింపు

వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో సంచలనం రేపిన లక్ష్మీఆశాజ్యోతి(24) అనే వివాహిత హత్య కేసులో నిందితులు ఎల్లసిరి అశోక్, చీకవోలు పెంచలయ్య, ఓజిలి సురేష్‌ను సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కొండపనాయుడు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు.. వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన లక్ష్మీఆశాజ్యోతి అనే వివాహితను.. ఈ నెల 9న చిత్తూరులోని తొట్టంబేడు మండలం చోడవరానికి చెందిన ఎల్లసిరి అశోక్ కిరాతకంగా గొంతు కోసి హతమార్చాడు. అలాగే ఆమెకు చెందిన సరుడు, కమ్మలు, ఉంగరం అపహరించుకుని పోయాడు. తన గ్రామానికే చెందిన చీకవోలు పెంచలయ్య, ఓజిలి సురేష్ సహకరించారని విచారణలో నిందితుడు అశోక్ తెలిపినట్లు సీఐ వివరించారు. అశోక్ తన కొడుకు పుట్టిరోజు వేడుకలు నిర్వహించేందుకు నగదు కోసం తనకు పరిచయం ఉన్న లక్ష్మీఆశాజ్యోతి ఇంటికి వచ్చాడు. ఒంటరిగా ఉన్న ఆమె బంగారు ఆభరణాలు లాక్కుని, గొంతుకోసి పరారయ్యాడు. ఈ ఆభరణాలను శ్రీకాళహస్తిలోని ఓ కుదువ దుకాణంలో తాకట్టుపెట్టి కొడుకు పుట్టినరోజు జరిపినట్లు సీఐ తెలియజేశారు. అశోక్ వాంగ్మూలం మేరకు తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలు, హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన హెడ్‌కానిస్టేబుల్స్ వెంకటేశ్వరరావు, మహమ్మద్ రఫీ, కానిస్టేబుల్స్ వెంకటకృష్ణయ్య, లక్ష్మీకాంత్‌కు రివార్డు కొరకు ఎస్పీకి ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కొండపనాయుడు

కత్తితో దాడిచేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

తడ: వేనాడు గ్రామంలోని షేక్ దావూద్ షావలీ అల్లా దర్గా దర్శనార్థం వచ్చి, మరో వ్యక్తితో గొడవ పడి, కత్తితో దాడిచేసిన చెన్నైకు చెందిన డీ భాస్కర్‌కు సూళ్లూరుపేట ఫస్ట్‌క్లాస్ కోర్టు మంగళవారం 14 రోజుల రిమాండ్ విధించింది. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి దర్గాలో తమిళనాడులోని తిరువళ్లూరు రాజాజిపురానికి చెందిన భారతీఅరసు, చెన్నైకు చెందిన డి.భాస్కర్ గొడవ పడ్డారు. రాత్రి సర్దుబాటు అయినా.. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళుతున్న భారతీఅరసుని భాస్కర్ వెంబడించి కత్తితో దాడిచేసి గాయపరిచాడు. స్థానికుల సమాచారంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరచగా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ గాయత్రి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు నిందితుడిని గూడూరు జైలుకు తరలించారు.

రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

నెల్లూరు(అర్బన్): కలిగిరి మండల తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జ్యోతిని కలెక్టర్ రేవు ముత్యాలరాజు సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గతంలో వింజమూరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేసినప్పుడు పట్టాదారు పాసు పుస్తకాలకు సంబంధించి గోల్‌మాల్ చేశారు. ప్రభుత్వ భూములకు కూడా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో విచారణ జరిపిన కలెక్టర్ ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఆమెను సస్పెండ్ చేశారు.

గుర్తుతెలియని ముగ్గురి మృతి



ముత్తుకూరు: సుబ్బారెడ్డిపాళెంలో మృతదేహం



సిటీ: పెన్నానది ఒడ్డున మృతదేహం

ముత్తుకూరు: మండలంలోని సుబ్బారెడ్డిపాళెంలో వెంకటాచలం రోడ్డు చెంతనే ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముత్తుకూరు పోలీసుల కథనం మేరకు..45 ఏళ్ల వయసు కలిగిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా బిక్షమెత్తుకొంటూ ఇక్కడ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. సోమవారం పూటుగా మద్యం సేవించిన అతను రోడ్డు పక్కన పడిపోయాడు. రాత్రి మృతి చెందాడు. ఎస్సై సాంబశివరావు సూచన మేరకు మృతుడి వివరాల కోసం పరిసర గ్రామాల్లో విచారించారు. పేరు ఏమిటో, ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అనేది ఎవ్వరూ చెప్పలేకపోవడం వల్ల పంచాయతీ సర్పంచ్ భాస్కర్ సహకారంతో ఊరి శివారులో ఖననం చేశారు.

పెన్నానదిలో..

నెల్లూరు సిటీ: తల్పగిరి రంగనాయకులస్వామి ఆలయానికి సమీపంలో పెన్నానది ఒడ్డున గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని తల్పగిరి రంగనాయకులస్వామి ఆలయం పడమరవైపు ఉండే పెన్నానదిలో గుర్తుతెలియని(42) వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి మూడో నగర పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నీటిలో మునిగి బాగా ఉబ్బి ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

నెల్లూరు సిటీ: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని (70) వృద్ధుడు మంగళవారం పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. దీంతో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జోసఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆరోగ్యసమస్యలు. దూరప్రయాణాలు. సోదరులతో విభేదాలు. శ్రమ తప్ప ఫలితం ఉండదు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

వృషభం: బంధువర్గం నుంచి ఒత్తిడులు. ఆధ్యాత్మిక చింతన. పనులు ముందుకు సాగవు. ప్రయాణాల్లో మార్పులు. దైవదర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.



మిథునం: నూతన వ్యక్తుల పరిచయం. శుభవార్తలు వింటారు. కొత్త విషయాలు తెలుస్తాయి. విద్యార్థుల కలలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

కర్కాటకం: శ్రమ తప్పకపోవచ్చు. కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆకస్మిక ప్రయాణాలు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. సేవలకు గుర్తింపు రాగలదు. ఆహ్వానాలు అందుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

కన్య: రుణదాతల ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువులతో తగాదాలు. అనారోగ్యం. ఊహించని ప్రయాణాలు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

తుల: ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో గౌరవం. ఆస్తి విషయాలలో ఒప్పందాలు. వాహనయోగం. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు ఒడిదుడుకులు తొలగుతాయి.

వృశ్చికం: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. పలుకుబడి పెంచుకుంటారు. విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలు సజావుగానే సాగుతాయి.

ధనుస్సు: పనుల్లో ఆటంకాలు. దుబారా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దూరపు బంధువుల కలయిక. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో చిక్కులు.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. పనులలో ఆటంకాలు. స్నేహితులతో కలహాలు. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

కుంభం: శుభకార్యాలలో పాల్గొంటారు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో పురోభివృద్ధి. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి.

మీనం: చిరకాల మిత్రులను కలుసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. వాహనయోగం. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

– సింహంభట్ల సుబ్బారావు

24న ప్రైవేటు పాఠశాలల బంద్



మాట్లాడుతున్న అపస్మా జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి,

నెల్లూరు (టౌన్): రాష్ట్ర పాఠశాల అసోసియేషన్ నాయకులపై దాడిని నిరసిస్తూ ఈ నెల 24న జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు అపస్మా జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలులో అపస్మా రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్య, అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిపై విద్యార్థి నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా విద్యాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు మూసివేయనున్నట్లు తెలిపారు. నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి కలెక్టర్, ఎస్పీ, డీఈఓ కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అపస్మా నాయకులు వెంకటరామయ్య, విజయకుమార్‌రెడ్డి, కృష్ణారావు, అభిషేక్‌రెడ్డి, నరసింగరావు, మహేంద్ర పాల్గొన్నారు.

బంద్‌తో సంబంధం లేదు

ఈ నెల 24న పాఠశాలల బంద్‌కు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇచ్చిన పిలుపుతో తమకు సంబంధం లేదని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్‌బాషా, జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాపరెడ్డి తెలిపారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం వారు సమావేశమయ్యారు. బంద్‌లో ప్రైవేటు గుర్తింపు పొందిన విద్యాసంస్థలు పాల్గొనడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఫార్మేటివ్, సమ్మేటివ్ ఉన్నందున సిలబస్ పూర్తి చేసుకునేందుకు బంద్‌కు దూరంగా ఉండాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో చాట్ల నరసింహారావు, జిల్లా కార్యదర్శి కాంతారావు, సురేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర సైకాలజిస్ట్‌ల ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్‌బాబు



సురేష్‌బాబు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర సైకాలజిస్ట్‌ల ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెల్లూరు స్నేహ కౌన్సెలింగ్‌సెంటర్ నిర్వాహకుడు, ప్రముఖ సైకాలజిస్ట్ సురేష్‌బాబు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్ట్‌ల ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరులో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. అలాగే నెల్లూరుకు చెందిన సైకాలజిస్ట్‌లు ఎన్వీ సుబ్బారావు, బీవీ సుబ్బయ్య సభ్యులుగా ఎన్నికయ్యారని వివరించారు.

నేడు రేషన్ డీలర్ల జిల్లా సర్వసభ్య సమావేశం

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని టౌన్‌హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు రేషన్ డీలర్ల జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునగా గిరిజారావు, మాల్యాద్రి తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రేషన్ డీలర్ల సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని రేషన్ డీలర్లు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ రేపు

నెల్లూరు(లీగల్) : ఏపీ న్యాయవాదుల జేఏసీ పిలుపు మేరకు గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించనున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఫణిరత్నం, రోజారెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు 2012కు ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

నెల్లూరు వాతావరణం

గరిష్టం: 35.1°/కనిష్టం: 26.1°

నేడు
అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం.
గాలులు వీచే అవకాశం.
ఉదయం వేడిగా ఉంటుంది
గరిష్టం: 36 సీ, కనిష్టం: 27 సీ

గురువారం
గాలులు వీచే అవకాశం.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
ఉదయం ఆహ్లాదంగా ఉంటుంది.
గరిష్టం: 35 సీ, కనిష్టం: 25 సీ.

శుక్రవారం
చిరుజల్లులు కురిసే అవకాశం.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
ఉదయం వేడిగా ఉంటుంది.
గరిష్టం: 34 సీ, కనిష్టం: 25 సీ

సోమశిలలో 6.542 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రం నాటికి 6.542 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి తాగునీటి అవసరాలకు 50 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 81.461 మీటర్ల మట్టం నమోదవగా 31 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథావుతోంది.

కండలేరులో 3.675 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 3.675 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు కండలేరు జలాశయం ఈఈ సురేష్ తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 265, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

నేడు జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సమావేశం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ బాబూజాకబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో జ్ఞానభూమి, ఆన్‌లైన్ అడ్మిషన్స్, తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి కళాశాలల ప్రిన్సిపల్స్ తప్పక హాజరు కావాలని కోరారు.

తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 5 కంపార్టుమెంట్లు మాత్రమే నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:
ఉచిత గదులు – 3 ఖాళీ ఉన్నాయి
రూ.50 గదులు – 15 ఖాళీ ఉన్నాయి
రూ.100 గదులు – 25 ఖాళీ ఉన్నాయి
రూ.500 గదులు – 10 ఖాళీ ఉన్నాయి

సేవలు
సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 200 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం – 230 ఖాళీ ఉన్నాయి

బుధవారం ప్రత్యేక సేవ – సహస్రకలశాభిషేకం

నెల్లూరు బులియన్

24 క్యారెట్ల బంగారం
ఒక గ్రామ్ రూ.3,009
22 క్యారెట్ల బంగారం
ఒక గ్రామ్ రూ.2,786
వెండి కిలో రూ.40,250
వెండి గ్రాము రిటైల్ ధర రూ.42.10

(బులియన్ మార్కెట్ సమాచారం మేరకు)

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ చికెన్ ధరలు

బ్రాయిలర్	* 94
లేయర్	* 82
బ్రాయిలర్ చికెన్	*154
స్కిన్‌లెస్ చికెన్	* 180
లేయర్ చికెన్	* 140

నిమ్మ ధరలు(బస్తా)

	సన్నవి	పెద్దవి	పండ్లు
వెంకటగిరి	500	1200	600
పొదలకూరు	1000	2400	600
గూడూరు	600-800	900-1400	300-600

వాతావరణం

రానున్న 24 గంటల్లో ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్ గంగా పరివాహక ప్రాంతాలు, జార్ఖండ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, తూర్పు రాజస్తాన్, దక్షిణ హరియాణా, ఢిల్లీల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తాయి.

గుంటూరు వాతావరణం

గరిష్టం కనిష్టం
35.6°/24.8°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.1	28.5
కోల్‌కతా	32.7	27.3
బెంగళూరు	28.0	21.1
ముంబై	31.3	22.2
చెన్నై	31.8	27.3

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
ఒంగోలు	36.9/25.3	కర్నూలు	34.0/24.8
గుంటూరు	35.6/24.8	రాజమండ్రి	34.0/24.5
విజయవాడ	35.4/25.2	నల్లగొండ	33.6/26.0
నెల్లూరు	35.1/26.1	శ్రీకాకుళం	33.1/26.0
ఖమ్మం	34.8/22.0	విజయనగరం	33.1/26.0
వరంగల్	34.6/25.0	హైదరాబాద్	32.9/23.1
అనంతపురం	34.6/24.5	రంగారెడ్డి	32.9/23.1
కాకినాడ	34.4/26.5	విశాఖపట్నం	32.3/26.8
తిరుపతి	34.4/24.0	మహబూబ్‌నగర్	32.3/23.6
కడప	34.3/25.0	కరీంనగర్	31.8/23.5
చిత్తూరు	34.3/24.0	నిజామాబాద్	30.6/22.5
ఏలూరు	34.0/27.5	మెదక్	30.4/20.5
తాడేపల్లిగూడెం	34.0/27.5	ఆదిలాబాద్	29.6/20.8

బుల్లితెర

W

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 ఎలక్షన్ డే
ఉ.09.30 ఎలక్షన్ డే
ఉ.10.00 ఎలక్షన్ డే
ఉ.10.30 ఎలక్షన్ డే
మ.02.30 ఎలక్షన్ డే
సా.04.30 ఎలక్షన్ డే
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 అయ్యప్ప దీక్ష
ఉ.09.30 స్నేహగీతం
మ.12.00 రగడ
మ.03.00 నా ఇష్టం
రా.09.00 ఇడియట్



మూవీస్ నౌ
ఉ.06.30 ల్యాండ్ ఆఫ్ ద డెడ్
ఉ.08.20 ద బౌర్న్ అల్టిమేటం
ఉ.10.30 బిగ్ హీరో 6
మ.02.25 యాంట్-మ్యాన్
సా.06.25 సూపర్‌మ్యాన్ 3




హెచ్‌బీవో
ఉ.06.16 ప్యాసింజర్ 57
ఉ.09.25 ఫూల్స్ గోల్డ్
ఉ.11.28 స్టెప్ అప్
సా.06.55 10,000 బి.సి.
రా.09.00 గెట్ స్మార్ట్



స్టార్ గోల్డ్
ఉ.09.30 చాందినీ చౌక్ టు చైనా
మ.12.45 కృష్ణా కాటేజ్
మ.03.30 ప్రేమ్ రతన్ ధన్ పాయో
సా.06.55 సింగం
రా.10.00 విధ్వంసక:ద డెస్ట్రాయర్



మా మూవీస్
ఉ.07.00 మళ్లీ మళ్లీ ఇది రానిరోజు
ఉ.09.00 మాస్
మ.12.00 జోకర్
మ.03.00 అల్లరి బుల్లోడు
సా.05.00 100% లవ్



జీ సినిమా
ఉ.04.45 క్యోం! హో గయా నా
ఉ.07.57 ఫటా పోస్టర్ నిఖ్‌లా హీరో
మ.02.45 ఆర్యా
సా.06.05 మేరా బద్లా: రివెంజ్
రా.09.00 ఇంటర్నేషనల్ రౌడీ



టంగుటూరి జయంతి నేడు

నెల్లూరు(బృందావనం): స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లంచేటి చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. బ్రాహ్మణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఎన్‌ఎఫ్‌పీఈయూ సమ్మె

నెల్లూరు(మినీబైపాస్): ఎన్‌ఎఫ్‌పీఈ మరియు ఏఐపీఈయు జీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఒక్క రోజు సమ్మె నిర్వహించనున్నట్లు ఎన్‌ఎఫ్‌పీఈ యూనియన్ గ్రూప్ సీ కార్యదర్శి ఏవీ కృష్ణయ్య, పీ 4 కార్యదర్శి సీ హెచ్ వెంకయ్య జీడీఎస్ కార్యదర్శి వీ సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడీఎస్ కమిటీ నివేదికలోని సానుకూల అంశాలను వెంటనే అమలు పరచాలని, అన్ని క్యాడర్లలోని ఖాళీలను భర్తీ చేయాలనే డిమాండ్‌లతో సమ్మె చేపడుతున్నట్లుగా వివరించారు. సమ్మెకు అందరూ మద్దతు తెలపాలని కోరారు.

రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు రేపు

నెల్లూరు(వేదాయపాళెం): నెల్లూరు రూరల్ మండలంలో 2017–18 ఆర్థిక సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీఎంఎస్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు. అభ్యర్థులు ఇంటర్వ్యూలకు వచ్చే సమయంలో తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

తప్పు చేస్తే చర్యలు తీసుకోండి

నెల్లూరు(పొగతోట): కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో చోటు చేసుకున్న అవకతవకలకు సంబంధించి ఆర్‌ఓలు, ఆర్‌ఐలు గత వారం షోకాజ్ నోటీసులు అందుకున్న విషయం తెలిసిందే. మంగళవారం షోకాజ్ నోటీసులు అందుకున్న ఆర్‌ఓలు, ఆర్‌ఐలు డీసీ శ్రీనివాసులుకు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. ఆర్‌ఐలు కృపాకరరావు, చిన్నబాబు తాము ఎటువంటి తప్పు చేయలేదని, తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకోమని వివరణ ఇచ్చారు.

ఆర్‌ఐల నియామకం

రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఆర్‌ఐలు కృపాకరరావు, చిన్నబాబు గత వారం బదిలీ చేసిన విషయం తెలిసిందే. వారి స్థానాల్లో కొత్త వారిని నియమించారు. కృపాకరరావు స్థానంలో కృష్ణకిషోర్, చిన్నబాబు స్థానంలో సునీల్‌కుమార్‌ను నియమిస్తూ కమిషనర్ ఢిల్లీరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేదల భూములను లాక్కోవడం దారుణం

సీపీఐ సీనియర్ నేత పముజుల



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన పముజుల

నెల్లూరు రూరల్ : కొండ్లపూడిలో దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములను ఇళ్ల స్థలాల పేరుతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడం దారుణమని సీపీఐ సీనియర్ నేత పముజుల దశరథ రామయ్య అన్నారు. కొండ్లపూడిలోని సీలింగ్ భూములను దళితులు, గిరిజనులకే కేటాయించాలని కలెక్టరేట్‌లో కలెక్టర్ ముత్యాలరాజుకు మంగళవారం ఆయన గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పముజుల మాట్లాడుతూ కొండ్లపూడిలోని 40 ఎకరాల సీలింగ్ భూములను పదేళ్లుగా దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూముల్లో సాలుచింతలకు చెందిన రోడ్డు విస్తరణ బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం సరికాదన్నారు. ప్రశ్నించిన దళితులపై కేసులు పెట్టడం అధికారులకు తగదన్నారు. భూముల విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామని, ఈ నెల 28న కోర్టు తీర్పు రావాల్సి ఉందన్నారు. నెల్లూరు ఆర్డీఓ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పేదల సాగులోని 160 నిమ్మచెట్లను తొలగించి భూమిని చదును చేసి, లేఅవుట్ వేశారన్నారు. ఇప్పటికైనా భూములను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు చిన్న అంకయ్య, కొండ్లపూడి గ్రామదళితులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల మౌన ప్రదర్శన



గాంధీ బొమ్మ వద్ద మౌన ప్రదర్శన చేస్తున్న తపాలా ఉద్యోగులు

నెల్లూరు(మినీబైపాస్): అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తపాలా ఉద్యోగులు చేపడుతున్న సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా నగరంలోని గాంధీబొమ్మ వద్ద ఉద్యోగులు ప్లకార్డులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి దుడ్డు రమేష్, డివిజనల్ కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందన్నారు. కమలేష్ చంద్ర 'పే' కమిటీ సూచనలను అమలు చేయకుండా జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా చాలీచాలని జీతాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటోందన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వకుండా పాయింట్ల సిస్టమ్‌ను ప్రవేశపెట్టి అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం సమస్యలపై స్పందించకుంటే సమ్మెను తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆర్ సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీ వేమయ్య, ఎం నాగరాజు, వీ నాగరాజు, ఎల్ రవికుమార్, శివరామకృష్ణ, కృష్ణమూర్తి, రామ్మూర్తి, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాంక్షిస్తూ మానవహారం



పురమందిరం వద్ద మానవహారం నిర్మిస్తున్న ఎస్డీపీఐ నేతలు

నెల్లూరు(బృందావనం): మత సామరస్యాన్ని కాంక్షిస్తూ సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో మంగళవారం మానవహారం నిర్మించారు. తొలుత పురమందిర ప్రాంగణంలోని రీడింగ్‌రూంలో జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఘని మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై గోవధ పేరుతో కొన్ని మతోన్మాదశక్తులు దాడులకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మతోన్మాదశక్తుల వైఖరిని ప్రజాస్వామ్యవాదులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నేత ముఫ్తి అబ్దుస్‌సుబహాన్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌షాఫిక్, ఎస్డీపీఐ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులు అహ్మదుల్లాషరీఫ్, ముఫ్తి అబ్దుల్ రెహమాన్, పౌరహక్కుల సంఘం నేత ఎల్లంకి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో మంగళవారం దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు బుద్ధి మాంద్యుల సాధికార సంస్థ అధికారి కృష్ణబిందు హాజరై సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, రాజేష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాబ్జాన్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సురేంద్ర, దివిజాదేవి, జోజి పాల్గొన్నారు.

పెద్దచెరుకూరులో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు రూరల్: పెద్దచెరుకూరులో నెల్లూరు కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబి రాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్యులు మాదాల రాజేష్ విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణప్రసాద్, శ్రీనివాసులు, కొండయ్య, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వనంతోపు సెంటర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు జిల్లా సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ఏజీఎం కొండారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను ఏజీఎం అభినందించారు. 8వ తరగతికి చెందిన మోన్విత , 9వ తరగతికి చెందిన విష్ణుతేజ, సాయి ఉమేష్, ఆదిత్య జిల్లా జట్టుకు ఎంపికై నట్లు ఏజీఎం తెలిపారు. 1 నుంచి ఒంగోలులో జరిగే అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ప్రిన్సిపల్ అనిత మేరి, వ్యాయాయ ఉపాధ్యాయులు సర్దార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

నెల్లూరు సిటీ: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఆరుగురిని మంగళవారం ఒకటో నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూలాపేటలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరుగురు బెట్టింగ్‌రాయుళ్లతో పాటు ఓ టీవీ, ఐదు సెల్‌ఫోన్లు, రూ.7,850 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పంటర్ అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ కేసులో బీవీనగర్‌కు చెందిన పిన్నిసెట్టి సురేష్‌ను ఐదో నగర పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్ కేసులో బీవీనగర్‌కు చెందిన ఆరుగురు పంటర్లను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడు సురేష్‌కు ఆరోగ్యం సరిగా లేక పోవడంతో చికిత్స అనంతరం ఐదో నగర సీఐ మంగారావు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు.

కార్మిక నిధిని మళ్లిస్తే సహించం

నెల్లూరు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన నిధిని దారి మళ్లిస్తే సహించమని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

మరికొన్ని జోన్ వార్తలు 12లో

హోటల్‌లో స్వీపర్ మృతి

నెల్లూరు సిటీ: ఓ హోటల్‌లోని స్వీపర్ మృతి ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... ఏసీ సెంటర్‌లోనని ఆర్‌ఆర్‌వీధిలో ఉంటున్న తెన్నాటి సూర్యనారాయణ(56) రెండు నెలలుగా పొగతోటలోని వెంకటరమణా హోటల్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పోగతోటలో అతను మృతి చెందాడు. మద్యం సేవించి, గొంతు ఆరిపోవడంతో మృతి చెంది ఉండవచ్చని హోటల్ మేనేజర్ మాల్యాద్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకటో నగర హెడ్‌కానిస్టేబుల్ వెంకయ్య, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఒంటికి నిప్పంటించుకుని యువకుడి మృతి

విడవలూరు : మద్యం మత్తులో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటిచుకుని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ముదివర్తి గిరిజన కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముదివర్తి గిరిజన కాలనీకి చెందిన చౌటూరు వెంకటశేషయ్య (38) సోమవారం రాత్రి పూటుగా మద్యం సేవించాడు. మత్తులో ఉన్న వెంకటశేషయ్య తన ఇంట్లో ఉన్న కిరోసిన్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం మంటల మధ్యలో చిక్కుకున్న అతను పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేశారు. కాలిన గాయాలతో ఉన్న వెంకటశేషయ్యను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వెంకటశేషయ్య మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంపశయ్యపై 108



108 వాహనం ఆగిపోవడంతో నెడుతున్న సిబ్బంది

టీడీపీ ప్రభుత్వ హయాంలో 108 వాహనాల పరిస్థితి ఏంటో ఈ ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. ఏ క్షణంలో ఎక్కడ వాహనం ఆగిపోతుందో తెలియని పరిస్థితి. ఆపదలో ఉన్న వారి కోసం వెళ్లాల్సిన 108 వాహనం మరమ్మతులకు గురి కావడంతో మరో 108 వాహనం సాయంతో తాడు కట్టి రిపేరుకు లాక్కెళుతున్న దృశ్యం నెల్లూరు నగరంలోని కొండాయపాళెం గేటు సెంటర్‌లో 'సాక్షి' కంటపడింది. ఒకరిని కాపాడాల్సిన వాహనం ఈ విదంగా ఆపదలో ఉందంటూ పలువురు విమర్శలు చేయడం వినిపించింది. – **నెల్లూరు(సెంట్రల్)**



తాడుతో కట్టి లాగేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

అక్రమాల పుట్ట



- కార్పొరేషన్ రెవెన్యూలో ప్రక్షాళన జరిగేనా..
- పై స్థాయి అధికారులను తప్పించే ప్రయత్నం
- తప్పు చేయని వారిపై చర్యలు

నెల్లూరు(పొగతోట):

కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. కమర్షియల్ భవనాలను రెసిడెన్షియల్‌గా మార్పులు చేసి అక్రమ మార్గంలో రూ.లక్షలు సంపాదిస్తున్నారు. 10 అడుగులు ఉన్న కమర్షియల్ భవనాన్ని ఐదు అడుగులు ఉన్నట్లు ఆస్తి పన్ను వేస్తున్నారు. ఇలాంటి భవనాలు నెల్లూరు నగరంలో వందల సంఖ్యలో ఉన్నాయి. కమర్షియల్ భవనాలను రెసిడెన్షియల్ మార్పులు చేసి పన్ను తక్కువగా వేస్తున్నారు. ఇలాంటి లీలలు రెవెన్యూలో అనేకం జరుగుతున్నాయి. బదిలీ అయిన ఏడీసీ అంజయ్య లాగిన్ అకౌంట్ నుంచి కొంతమంది ఆర్‌ఐలు అసెస్‌మెంట్లు జారీ చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' దినపత్రిక బయటపెట్టడంతో ఇద్దరు ఆర్‌ఓలు, 7 మంది ఆర్‌ఐలకు ఉన్నాతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 7 మందిలో ఇద్దరు ఆర్‌ఐలను బదిలీ చేశారు. అవినీతికి పాలప్పడిన ఆర్‌ఐలపై చర్యలు తీసుకోకుండా అక్రమాలు చేయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆర్‌ఐలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పు చేయకపోయినా మాపై చర్యలు తీసుకున్నారని వారు వాపోతున్నారు. ఇది కావాలనే ఒక వర్గం వారు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఉన్న వారిని మళ్లీ తీసుకురావడానికే..

గతంలో ఆర్‌ఐలుగా పనిచేసిన వారిని మళ్లీ తీసుకురావడానికే మమ్మల్ని బలి పశువులు చేశారని వారు వాపోతున్నారు. మేము తప్పు చేయలేదు..మాకు వచ్చిన ఫైళ్లను కార్పొరేషన్ ఉన్నాతాధికారికి పంపించి సంతకాలు చేయించి ఆర్‌ఓలకు అప్పగించామని కొంతమంది ఆర్‌ఐలు చెబుతున్నారు. తరువాత పని ఆర్‌ఓలు చేయాలి..దాంతో మాకేం సంబంధమని కొంతమంది ఆర్‌ఐలు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో కొంతమంది ఆర్‌ఐలు అక్రమాలకు పాల్పడుతూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లను రెసిడెన్షియల్‌గా మార్పులు చేసి అక్రమంగా రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఇలా అక్రమ సంపాదనను కింది నుంచి పై స్థాయి అధికారుల వరకు వాటాలు పంచుతున్నట్లు సమాచారం. కాగా రెవెన్యూలో అక్రమాలకు పాల్పడే ఉద్యోగులను మెల్లగా పక్కకు పంపించే ప్రయత్నాలు కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతం ఇద్దరు ఆర్‌ఐలను బయటకు పంపించారు. ఇద్దరు ఆర్‌ఓలను మార్పు చేసి కొత్త వారిని తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మిగిలిన 5 మంది ఆర్‌ఐలను కుడా రెండు, మూడు రోజుల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రెవెన్యూ విభాగాన్ని పూర్తి స్థాయిలో పక్షాళన చేయాలంటే రాజకీయ నాయకులు అడ్డుపడే అవకాశం ఉంది. అధికార పార్టీ మంత్రులు, నాయకులు, పాలకసభ్యులు అభ్యంతరాలు తెలిపే అవకాశం ఉంది. ఇద్దరు ఆర్‌ఓలను మార్పులు చేసి కొత్త వారిని నియమించడానికి ఆ స్థాయి హోదా కలిగిన అధికారులు లేరు. ఉన్న ఒక్కరు కీలకంగా ఉన్నారు. పూర్తి స్థాయిలో ఆర్‌ఐలను మార్పు చేయాలన్నా పాత వారిని నియమించాల్సివస్తోంది. ఇలాంటి సమస్యలు ఉన్న నేపథ్యంలో రెవెన్యూ విభాగంలో పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడం ఇప్పట్లో జరుగుతుందో లేదో వేచి చూడాల్సిఉంది.

ఐటీ దడ

- ముగిసిన రిటర్న్స్ దాఖలు గడువు
- లెక్కలు చూపని పలువురుకు నోటీసులు
- క్రికెట్ బుకీల ఆస్తులపై ఐటీ ఆరా
- రియల్ ఎస్టేట్‌లో చేరిన రైస్‌మిల్లర్లపై దాడులు
- నేడు, రేపు తిరుపతిలో విచారణ

నెల్లూరు(టౌన్):

ఆదాయపన్ను శాఖ అధికారుల దాడులు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనని వ్యాపారులు, ఉన్నతవర్గాలు హడలెత్తిపోతున్నారు. ఓ వైపు బెట్టింగ్ మాఫియాలో కోట్లాది రూపాయల టర్నోవర్ జరిగి ఉండటం, ఆ మూలాలన్నీ నెల్లూరులోనే బయటపడటం, మరోవైపు విశాఖ భూకుంభకోణంలోని ఆర్థిక లావాదేవీల తీగ అక్కడ కదిపితే సింహపురిలో కదలడంతో సంబంధిత వ్యక్తులకు వణుకుపుడుతోంది. అయితే ఐటీ రిటర్న్స్ దాఖలు గడువు ముగియడం, పలువురు తూతూ మంత్రంగా లెక్కలు చెప్పడంతో అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. నెల్లూరులోనే తిష్టవేసి అక్రమార్కుల భరతం పట్టేందుకు ఐటీ అధికారులు అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఆదాయాల లెక్కలు చూపని పలువురు వ్యాపారాలు, ధనవంతులకు నోటీసులు జారీ చేశారు.

వరుస దాడులతో హడల్

ఆదాయపన్ను శాఖ అధికారులు గత నాలుగు రోజులుగా పలువురి ఇళ్లపై దాడులు చేశారు. విశాఖ, హైదరాబాద్, తిరుపతి నుంచి వచ్చిన సిట్ బృందం, ఆదాయపన్ను శాఖ అధికారులు పలువురి ఇళ్లలో సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా ఆస్తులు బయటపడటంతో ఇందుకు సంబంధించిన రికార్డులు, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తొలుత నెల్లూరు రూరల్ పొట్టేపాళేనికి చెందిన బండి శ్రీకాంత్‌రెడ్డి నివాసంలో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయనతోపాటు జిల్లాలో మరికొందరు కలసి విశాఖలో భారీగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలకు సంబంధించి పలువురు పేర్లు, రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మరుసటి రోజు స్థానిక మాగుంటలేవుట్‌లో పొల్యూషన్ కన్సల్టెంట్ వేణుగోపాలరెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించారు. ఇక్కడ కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా నెల్లూరు నగరంలోని ప్రకాష్‌నగర్, లక్ష్మీనగర్, రూరల్ ప్రాంతాల్లోని రైస్ మిల్లులపై తనిఖీలు నిర్వహించారు. రియల్ ఎస్టేట్ వ్యాపార సంబంధ లావేదేవీలపై ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన పలు రికార్డులు, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించి సుమారు రూ.50 కోట్లు లావాదేవీలు జరిగాయని గుర్తించినట్లు తెలిసింది. విశాఖ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాలు పంచుకున్న జిల్లాకు చెందిన 20 మందిని గుర్తించారు. ప్రస్తుతం 8 మందికి నోటీసులు జారీ చేశారు. వారిని బుధ, గురు వారాల్లో తిరుపతిలో విచారణకు రావాలని పేర్కొన్నారు. త్వరలో మిగిలిన వారి ఇళ్లలో కూడా తనిఖీలు చేసే అవకాశం ఉంది.

పలువురికి నోటీసులు జారీ

ఆదాయానికి సంబంధించి పన్ను దాఖలు గడువు ఈ నెల 5వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆదాయాల లెక్కలు చూపని పలువురు వ్యాపారులు, ధనవంతులకు ఆదాయపన్ను శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. బ్యాంకుల్లో జరిపిన లావాదేవీల వివరాలను ఐటీ అధికారులు సేకరించారు. అయితే కొంత మంది బడావేత్తలు భారీగా ఆస్తులు సంపాదించి మొక్కుబడిగా రిటర్న్ దాఖలు చేసి భారీ మొత్తంలో పన్ను ఎగవేస్తున్నట్లు గుర్తించారు. వారికి కూడా నోటీసులు జారీ చేసే యోచనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

బుకీల ఆస్తులపై ఆరా

క్రికెట్ బుకీల ఆస్తులపై ఆదాయపన్ను శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే పోలీసుల విచారణలో బుకీలకు సంబంధించిన ఆస్తులు భారీగా వెలుగులోకి వచ్చాయి. బ్యాంకుల ద్వారా కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. బెంగుళూరు, హైదరాబాద్, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో భవనాలు, ఆస్తులు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. అయితే బ్యాంకుల లావాదేవీల వివరాలను ఇప్పటికే ఐటీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. క్రికెట్ బుకీలకు సంబంధించి రెండు విడతలుగా పోలీసులు విచారణ చేపట్టారు. బెట్టింగ్ వ్యహహారంలో పాలు పంచుకున్న పలువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం రాజకీయ నాయకుల పాత్రపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసుల నుంచి పూర్తి ఆధారాలు తీసుకుని క్రికెట్ బుకీల ఇళ్లపై ఐటీ అధికారులు తనిఖీలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వాళ్లతో నాకు సంబంధం లేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- రాజకీయల్లోకి వచ్చాక రూ.30 కోట్ల ఆస్తులు అమ్ముకున్నా
- టీడీపీ ముఖ్య నాయకులకు సంబంధించిన బుకీలు పట్టుబడ్డా నోటీసులు ఇవ్వరు
- మా వాళ్లు డబ్బులు పోగుట్టుకుంటే నోటీసులా?
- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు సిటీ: 2009 నుంచి రాజకీయాల్లోకి వచ్చాక రూ.30 కోట్లు ఆస్తులు అమ్ముకున్నానుగానీ.. ఎవరి దగ్గరా ఒక్క రూపాయి చేయిచాచిన సందర్భాలు లేవని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. తల్లిసాక్షిగా చెబుతున్నాను.. తనకు బుకీలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళ వారం ఆయన విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను ఎవరితోనూ లావాదేవీలు చేయలేదని తెలిపారు. నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో నోటీసులిచ్చారన్నారు. తప్పు చేయలేదు కాబట్టి.. భయపడాల్సిన అవసరం తనకు లేదన్నారు. విచారణలో కృష్ణ సింగ్ తెలుసా.. పట్టుబడ్డ బుకీలు ఇంకెవరైనా తెలుసా అని ప్రశ్నించినట్లు తెలిపారు. సిటీ నియోజకవర్గంలో గడపగడపకూ వెళ్లిన వ్యక్తినని తెలిపారు. పెళ్లిళ్లల్లోనో, ఇతర కార్యక్రమాల్లోనో చాలా మందిని కలుస్తుంటామన్నారు. అయితే కృష్ణసింగ్‌తో ఒక్కసారి కూడా ఫోన్‌లో మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. కృష్ణసింగ్‌తో రెండు నిమిషాలు కూడా ఎక్కడా మాట్లాడలేదని తెలిపినట్లు చెప్పారు. కృష్ణసింగ్ ఎన్నికల సమయంలో ఫండ్ ఇచ్చారా అని ప్రశ్నించారన్నారు. కృష్ణసింగ్ దగ్గర నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పానన్నారు. 2009 సంవత్సరం నుంచి ఇస్కాన్‌సిటీలోని మూడున్నర ఎకరా, టెక్కేమిట్టలోని 100 అంకణాలు స్థలం, చెముడుగుంటలోని మూడున్నర ఎకరా భూమిని అమ్ముకున్నానని తెలిపారు. మొత్తం రూ.30 కోట్లు డబ్బును ఖర్చు చేశానన్నారు. ప్రస్తుతం రూ.2 కోట్లు బ్యాంకుల్లో రుణం తీసుకుని ఉన్నానని తెలిపారు. బుకీలు దగ్గర నుంచి డబ్బులు తీసుకుని ఉంటే అప్పులు పాలవ్వాల్సిన అవసరం తనకు లేదన్నారు. నెల్లూరు నియోజకవర్గంలో అనేక వ్యాపారాలు ఉన్నాయన్నారు. ఏ వ్యాపారి వద్ద నుంచి తన కార్యక్రమాలకు ఒక్క రూపాయి కూడా అడిగిన సందర్భాలు లేవన్నారు. తన పేరు చెప్పిన వారిని నా ముందు కూర్చోబెడితే నిజం ఏమిటో తెలుస్తుందన్నారు.

మా వాళ్లు డబ్బులు పోగొట్టుకున్నోళ్లే

తనతో ఉన్న రూప్‌కుమార్‌యాదవ్, నాగార్జున్‌రెడ్డిలు పంటర్‌లు మాత్రమేనని తెలిపారు. వీళ్లు డబ్బులు పోగుట్టున్న బాధితులన్నారు. వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గం నుంచి బుకీలు ఎవరూ లేరన్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా రాజకీయాల్లో ఉన్నానని, మీడియాలో తనపై వస్తున్న వార్తలకు భయపడనన్నారు. తాను సమాధానం చెప్పాల్సింది కార్యకర్తలు, తన నియోజకవర్గానికి మాత్రమే అన్నారు. తాను ఒక్క రూపాయి తీసుకోలేదని తన నియోజక వర్గ ప్రజలు నమ్మితే చాలన్నారు. వైఎస్సార్‌సీపీలో పంటర్లుగా నష్టపోయిన వాళ్లు మా వాళ్లు ఉంటే మాకు నోటీసులు ఇచ్చారన్నారు. అదే టీడీపీకి చెందిన కావలిలోని ఓ నాయకుడికి ఫ్లెక్సీలు కట్టిన బుకీ పట్టుబడితే ఆ నేతకు నోటీసులు ఇవ్వలేదన్నారు. నగరంలోని ఓ నేతకు చెందిన బుకీ పట్టుబడితే అతనికీ నోటీసులు ఇవ్వలేదన్నారు. టీడీపీలోని ఐదుగురు ముఖ్యనేతలకు సంబంధించిన వాళ్లు ఉంటే వారికి మాత్రం నోటీసులు ఇవ్వలేదన్నారు. తనపై బెట్టింగ్ మచ్చవేయాలని అనుకుంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. 27వ తేదీన తమను మళ్లీ విచారణకు రావాలని చెప్పారన్నారు. విచారణకు పూర్తిగా తన వంతు సహకరిస్తానని పోలీసులకు తెలిపానన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే కేసులు

- ఏ ఎమ్మెల్యేల పాత్ర లేదని ఇటీవల పోలీసు బాస్ స్పష్టం చేశారు
- నోటీసులు ఇవ్వడం వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు అనుమానం
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ప్రత్యర్థులు తమను రాజకీయంగా ఎదుర్కోలేక తమకు సంబంధం లేని కేసులు అంటగడుతున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి పోలీసు విచారణకు కోటంరెడ్డి హాజరయ్యారు. విచారణ అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. విచారణకు పూర్తిగా సహకరించానని తెలిపారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌ను మేయర్‌ను చేసేటప్పుడు 2014 ఎన్నికల సమయంలో సిటీ ఎమ్మెల్యే, తాను గోవాలో కార్పొరేటర్లతో క్యాంపెయిన్ పెట్టిన విషయం వాస్తవమా అని, కృష్ణసింగ్ అక్కడ ఖర్చుపెట్టాడా అని ప్రశ్నించారన్నారు. అందుకు సమాధానంగా తాను, సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గోవాకు వెళ్లిన విషయం నిజమేనని తెలిపానన్నారు. అక్కడ క్యాంపెయిన్ నిర్వహించామని తెలిపారు. అయితే రూ.కోట్లు కలిగిన మేయర్ అజీజ్‌కు కృష్ణసింగ్ డబ్బులు ఇచ్చారన్నది అవాస్తమని వివరించినట్లు చెప్పారు. కృష్ణసింగ్‌తో లావాదేవీలు ఉన్నాయా.. గంటలసేపు కృష్ణసింగ్‌తో మాట్లాడారా అని అడిగారన్నారు. దీనికి సమాధానం ఇస్తూ తనకు, కృష్ణసింగ్‌కు మధ్య లావాదేవీలు ఏమీ లేవని, కృష్ణసింగ్‌తో ఫోన్‌లో గంటలు తరబడి మాట్లాడలేదన్నారు. టీవీలో, విలేకరుల సమావేశంలో బాగా మాట్లాడావని తనకు మూడు, నాలుగుసార్లు మాత్రమే ఫోన్ చేసి ఉంటారని తెలిపారు. 20 సెకన్ల నుంచి 40 సెకన్లు మించిన మాట్లాడిన సందర్భం లేదన్నారు. రూప్‌కుమార్, ఎల్ఎస్ఆర్ (లేబూరు శ్రీధర్‌రెడ్డి), శ్రీకాంత్‌రెడ్డి ద్వారా కృష్ణసింగ్ ముడుపులు అందించారా అని ఆరోపణలున్నాయని అడిగినట్లు తెలిపారు. అలాంటిది ఏమీ లేదని చెప్పానన్నారు. కృష్ణసింగ్ అకౌంట్ నుంచి డబ్బులు తన అకౌంట్‌కు బదిలీ చేశారా అని అడిగారని, తాను సమాధానం ఇస్తూ నా అకౌంట్‌తో పాటు కుటుంబ సభ్యుల అకౌంట్‌లను కూడా పరిశీలించుకోవచ్చని చెప్పానన్నారు. ఎల్ఎస్ఆర్‌తో ఫోన్‌లో తరుచూ మాట్లాడుతున్నారా, ఎల్ఎస్ఆర్ కార్యాలయానికి వెళుతుంటారా అని అడిగినట్లు తెలిపారు. సమాధానం ఇస్తూ తనకు, ఎల్ఎస్ఆర్‌కు మధ్య హైస్కూల్ నుంచి పరిచయం ఉందని, ఖాళీ ఉన్న సమయాల్లో ఎల్ఎస్ఆర్ కార్యాలయానికి వెళుతానన్నారు. ఎల్ఎస్ఆర్ కార్యాలయానికి ఎవరెవరు వస్తుంటారని అడిగారన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎల్ఎస్ఆర్ కార్యాలయానికి వస్తుంటారని చెప్పినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు ఆనం వివేకాందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి అప్పుడప్పుడూ వస్తుంటారని తెలిపినట్లు చెప్పారు. ఎక్కువగా విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైవీరామిరెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు వస్తుంటారని చెప్పానన్నారు. అన్యాయంగా తమను కేసుల్లోకి లాగితే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. కొందరు ప్రభుత్వ పెద్దలు క్రికెట్ బెట్టింగ్ కేసులను ప్రత్యర్థి రాజకీయ నాయకులపై రుద్ది బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బెట్టింగ్‌ను అరికట్టేందుకు తమ నుంచి పోలీసులకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ నెల 3,14,18 తేదీల్లో మీడియాతో పోలీసు బాస్ స్వయంగా బెట్టింగ్ కేసులో ఏ ఎమ్మెల్యే పాత్ర లేదని చెప్పారని గుర్తుచేశారు. 21న తమను ఈ కేసుల్లోకి లాగుతూ నోటీసులు వచ్చాయంటే దీని వెనుకు ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తమవుతుందని తెలిపారు. ఈ నెల 27న విచారణకు మళ్లీ రావాలని పోలీసులు చెప్పారన్నారు.

అప్పుడు క్రీడాకారుడిగా..
ఇప్పుడు క్రీడా ప్రోత్సాహకుడిగా

- క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణించిన కోటారెడ్డి
- జిల్లాలో క్రీడాకారుల కోసం ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ
- సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి కృషిచేస్తున్న వైనం


అప్పటి భారత్ కెప్టెన్ అజహరుద్దీన్‌తో మలిరెడ్డి (కుడివైపున)


ఒకప్పటి భారత మహిళా జట్టు కెప్టెన్ పూర్ణిమారావ్‌తో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) :

క్రికెట్ క్రీడాకారుడిగా రెండు దశాబ్దాలపాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభను చాటాడు నెల్లూరుకు చెందిన మలిరెడ్డి కోటారెడ్డి. పాఠశాల స్థాయి నుంచి క్రికెట్ పట్ల ఉన్న క్రేజ్‌తో 'రంజీ స్క్వాడ్'లో స్థానం సాధించాడు. ఇంటర్ యూనివర్సిటీ కెప్టెన్‌గా మూడుసార్లు ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని బ్లూస్టార్ టైటిల్‌ను పొందాడు. క్రీడాకారుడిగా తాను ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ తరం పడకూడదని క్రికెట్ క్రీడాకారులతోపాటు ఇతర క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాడు.

ఆల్‌రౌండర్‌గా..

కోటారెడ్డి క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ ప్రేరణతో క్రికెట్ పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. నెల్లూరులోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదివేప్పుడు మొదటిసారిగా క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 1985–86లో శ్రీకాకుళంలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటాడు. వీఆర్ కళాశాల నుంచి అండర్ 17, 19, 21, 22, 23, సీనియర్స్ టోర్నమెంట్‌లతోపాటు వివిధ పోటీల్లో ఆల్‌రౌండర్‌గా రాణించి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రికెట్‌తోపాటు అంతర్ కళాశాలల, విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీల్లో సైతం ప్రతిభను కనబరిచాడు.

సహాయంగా..

కోటారెడ్డి రంజీస్క్వాడ్‌లో శిక్షణ పొందారు. ఆసమయంలో తనతోపాటు రంజీ టోర్నీ శిక్షణ పొందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల పరిచయాలు కొనసాగిస్తున్నారు. వారి సహాయ సహకారాలతో జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి సహాయపడుతున్నాడు. అప్పటి కెప్టెన్ అజారుదీన్, నెక్కంటి వెంకట్రావ్, క్రీడాకారుడు ఎంఎస్‌కే ప్రసాద్, చాముండేశ్వరినాథ్‌లు మలిరెడ్డి క్రీడా ప్రతిభను అభినందించేవారు. ఈయన గతంలో నెల్లూరులో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రస్తుత భారత క్రికెట్ మహిళా టీమ్ కెప్టెన్ మిథాలీరాజ్ బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంది. అడ్వకేట్ అయిన మలిరెడ్డి జిల్లాలో ఇతర క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడిగా ఉన్నారు. రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా, స్టేట్ బోర్డ్ సెలక్టర్‌గా ఫ్రెండ్‌షిప్ కప్ పేరుతో ఐదేళ్ల క్రితం క్రికెట్ టోర్నీని నెల్లూరులో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు. 20 రోజుల పాటు పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడారులను గుర్తిస్తుంటారు. అలాగే జిల్లాలో క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించడంతో ప్రధాన భూమికను పోషిస్తున్నారు.

ప్లేయర్స్ పెరిగారు



జిల్లాలో అప్పటికంటే క్రీడాకారుల సంఖ్య పెరిగింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఆట పెరగాల్సిన అవసరం ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రాక్టీస్ చేయాలి. ఫ్లడ్‌లైట్స్‌లో ప్రాక్టీస్ చేసేందుకు గ్రౌండ్ కావాల్సి ఉంది. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. – మలిరెడ్డి కోటారెడ్డి


రాష్ట్ర క్రికెట్ జట్టులో నిల్చున్న వారిలో కుడి నుంచి నాలుగో వ్యక్తి

వ్యర్థం క

వాడి పారేసే వ







సూళ్లూరుపేట :

మనం వేస్ట్ అనుకునే వాటితో కళారూప
లు చేసి ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవచ్చ
నిరూపించింది పట్టణానికి చెందిన గృహి
సలువాది మల్లి విష్ణువందన. ఈమె వేస్ట్ మె
రీయల్‌తో, మరికొంత సామగ్రి జోడిం
రూపొందించిన వస్తువులు చూస్తే ఆశ్చర్యం క
గడం ఖాయం. వాడి పారేసిన అనేక రకాల వ
వులను వినియోగించి దేవుడి మండపా
రూపొందించి ఆకట్టుకుంటోంది. ప్లాస్టిక్, ఇత

తక్కువ ఖర్చుతో చేయొచ్చు



ఇంటిని అలంకరించుకునేందుకు రూ.వేలు ఖర్చు చేస్తుంటారు. వేస్ట్ మెటీరియల్‌తో రూ.700 ఖర్చుతో కొన్ని కళారూపాలు చేసి ఇంటిని అలంకరించాను. దీని వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. – విష్ణువందన



జన్మభూమిపై మమకారం..
గ్రామాభివృద్ధికి శ్రీకారం


గిరిజనులకు దోమతెరలు, దుప్పట్లు ఇస్తున్న దృశ్యం

- ఫౌండేషన్ స్థాపించి దామేగుంటలో సేవా కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తున్న యువకులు



ఆ యువకులు బాగా చదివి వివిధ నగరాల్లో స్థిరపడ్డారు. తమ సంపాదనలో కొంతైనా తల్లిలాంటి స్వగ్రామానికి వెచ్చించి అభివృద్ధి చేయాలని సంకల్పించారు. చేయిచేయి కలిపి 'దామేగుంట యూత్ ఫౌండేషన్'ను స్థాపించారు. ఇప్పటికే పలు కార్యక్రమాలు చేసి భవిష్యత్‌లో మరిన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు.

కొడవలూరు(కోవూరు): మండలంలోని దామేగుంట గ్రామం అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉంది. దీంతో గ్రామానికి చెందిన గల్లా కృష్ణ స్వగ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నడుం బిగించాడు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ గ్రామస్తులతో ఈ విషయం చర్చించాడు. వారు సానుకూలంగా స్పందించడంతో 2016 సంవత్సరంలో 40 మందితో దామేగుంట యూత్ ఫౌండేషన్‌ను స్థాపించారు. దీనికి గల్లా కృష్ణ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా మాచాల శ్రీనివాసులు, వక్కల మల్లికార్జున, కార్యదర్శిగా నక్కల శివకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా పూట్ల సతీష్, ఉప్పునూరు వాసు, కోశాధికారిగా మధుసూధన్‌నాయుడు, మిగిలిన వారంతా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

ఏం చేశారంటే..

- ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ఫ్యాన్‌లు, బెంచీల ఏర్పాటు.
- తలమంచి రోడ్డు నుంచి దామేగుంటకు వెళ్లే ఒక కి.మీ రోడ్డు చీకటి పడితే అంధకారంగా ఉంటుండటంతో రోడ్డు పొడవునా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు.
- గ్రామ శ్మశానం ఎప్పటినుంచో ఆక్రమణకు గురై ఉండగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణల తొలగింపు, మట్టితోలించి చదును చేయడం. బెంగళూరు నుంచి మొక్కలు తెప్పించి నాటడం.
- ప్రాథమిక పాఠశాల వి
విద్యాసామగ్రి అందజేయడ
- గ్రామ గిరిజనకాలనీవా
రలు పంపిణీ.

యువకుల సేవాభావం భేష్



గ్రామంలోని యువకులంతా ఒక తాటిపై నడుస్తూ సొంత నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేయడం అభినందనీయం. వారిని ప్రోత్సహించేందుకు సర్పంచ్‌గా నేను సిద్ధం.
– అనికేపల్లి వెంకటరత్నం, సర్పంచ్,దామేగుంట

ఆదర్శ గ్రామంగా

2020 సంవత్సరం నాటికి
తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట
రూపొందించుకుని కృషి చే
ఏ దేశమైనా అభివృద్ధి చెం
స్ఫూర్తిగా తీసుకుని గ్రామా

...కాదు.. అర్థం

...వస్తువులతో కళారూపాలు తీర్చిదిద్దిన గృహిణి

వస్తువులను బయట పారేసి పర్యావరణాన్ని పాడు చేసే బదులుగా కళారూపాలు చేసి ఇంట్లో అందంగా అలంకరించుకోవచ్చని చెబుతోంది. ఆమె గతంలో బియ్యం గింజలపై అనేక కళాకృతులను రూపొందించి అందరి మన్ననలు పొందారు.

ఏ వస్తువులు రూపొందించారంటే..

థర్మాకోల్ డిస్పోజబుల్ ప్లేట్, జ్యూస్ తాగే స్ట్రాలు, వెల్వెట్ క్లాత్, బిగ్‌షాపర్ కర్ర, అందమైన పూసలతో వినాయకుడికి గొడుగు తయారుచేసింది. థర్మాకోల్ డిస్పోజబుల్ ప్లేట్, పేపర్‌తో తయారుచేసిన టీకప్పులు, మెటాలిక్ పెయింట్, ఉలన్, రంగురంగుల పూసలు, కుందనలతో ఇంట్లో అందంగా షాండ్లియర్‌ను వేలాడదీసింది. విరిగిపోయిన గాజులు, పెండ్లిపిలుపు కార్డులపై ఉండే వినాయక బొమ్మలు, పెవికోల్, ఉలన్, కుందనలతో కలిపి గాజుల తోరణాన్ని తీర్చిదిద్దింది. వాడిపారేసిన సీడీ, చిన్నపాటి ప్లాస్టిక్ బాటిల్, మెటాలిక్ పెయింట్, స్టోన్‌లైయన్స్, కుందన్స్‌తో ఫ్లవర్‌వాజ్ తయారుచేశారు. విరిగిన కొబ్బరిచిప్పలు, వేస్ట్ సీడీ, కూల్ డ్రింక్ బాటిల్‌మూత, ముత్యాల్లాంటి పూసలు, డిజైనింగ్ వర్క్‌కు ఉపయోగించే లేస్‌తో బ్యాగ్‌ను పోలిన పూలబుట్ట తయారుచేసింది.





వినాయకుడి మండపం..

వినాయకచవితి సందర్భంగా వినాయకుడి ప్రతిమలను వెరైటీగా చూపించేలా అందమైన మండపం తయారుచేసింది విష్ణువందన. చిన్నబక్కెట్లపై ఉండే మూతలు, వాడిపారేసిన స్కెచ్‌పెన్నులు, జ్యూస్ బాటిల్ పైభాగం, క్యాన్‌వాస్, ఐ డ్రాప్స్ బాటిల్‌పై మూత, కుందన్స్, జెరీ అంచు, గ్లిట్టర్, మెటాలిక్ పెయింట్, గిఫ్ట్‌గా వచ్చే మనకు వచ్చే వివిధ దేవుళ్ల ప్రతిరూపాలతో మండపం రూపొందించారు. ఇందులో స్కెచ్‌పెన్నుల స్థానంలో సిరంజిలను కూడా వినియోగించుకోవచ్చు. దేవుడికి హారతి ఇచ్చేందుకు థర్మాకోల్ డిస్పోజబుల్ పెద్దప్లేట్, క్యాన్వాస్, వినాయకుని రూపాలు, కుందన్ పూలతో హారతి పళ్లెం తయారుచేసింది.

సుబ్బరాయుడు కోలాటం అదుర్స్

- నాలుగు దశాబ్దాలుగా ప్రదర్శనలు ఇస్తున్న వైనం
- పదుల సంఖ్యలో శిష్య బృందాలు
- గ్రామాల్లో పెరుగుతున్న ఆదరణ



శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి గ్రామోత్సవంలో కోలాటం ప్రదర్శన

పొదలకూరు(సర్వేపల్లి) :

సంప్రదాయ కళలు క్రమంగా అంతరిస్తున్న రోజులివి. ఎక్కడో కొన్నిచోట్ల ప్రాచీన కళలను కొందరు కాపాడుకుంటూ వస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా తరగని ఆదరణతో కోలాటానికి ఖ్యాతి తీసుకువస్తున్నాడు చెన్నూరు సుబ్బరాయుడు(సుబ్బారెడ్డి). ఏడు పదుల వయస్సులోనూ లయతప్పకుండా ఆడుతూ అలరిస్తున్నాడు. శిష్యులను పోగేసి ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దైవకార్యాలకు సుబ్బారాయుడి కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సమైక్యాంధ్ర ఉద్యమంలో సుబ్బరాయుడు బృందం పాల్గొని తమ కోలాటం ద్వారా ఉద్యమానికి ఊతమిచ్చారు.

పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు వృత్తి వ్యవసాయం అయినప్పటికీ ప్రవృత్తి భజనలు, కోలాటం. తన సంప్రదాయ కోలాటం ద్వారా ఎన్నో ప్రశంశలు, బహుమతులను అందుకున్నారు. గురువు భిక్షాలదాసు ఇద్ద కోలాటం అభ్యశించిన సుబ్బరాయుడుకి మరొకరు ఆకుల చినగంగిరెడ్డి తోడై సుమారు 40 మంది శిష్య బృందంతో కోలాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా పొదలకూరు పట్టణానికి చెందిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి మహిళలకు సైతం శిక్షణ ఇచ్చారు. నిరంతర విద్యార్థిగా మెళకువలు, కొత్తరకం కోలాటాన్ని తెలుసుకుంటూ శిష్యులకు మెళకువలను నేర్పుతున్నారు.

మూడురకాల కోలాటాలు ప్రదర్శన..

సుబ్బరాయుడు, చినగంగిరెడ్డిలు మూడు రకాల కోలాటాలను ప్రదర్శిస్తుంటారు. సమయం, సందర్భం ఆయా గ్రామస్తుల అభిరుచి మేరకు ఇవి జరుగుతాయి. అడుగు కోలాటం, పుల్లకోలాటం, భజన కోలాటంలో వీరు సిద్ధహస్తులు. జడకోలాటం కూడా ఉన్నప్పటికీ వ్యవ, ప్రయాసలతో కూడుకున్నది కావడంతో సుబ్బరాయుడు బృందం పెద్దగా ప్రదర్శించదు. సుబ్బరాయుడు ఇప్పటి వరకు 15 బృందాలకు కోలాటంలో శిక్షణ ఇచ్చారు. బృందానికి 40 మంది సభ్యులు ఉంటారు. ఈయనకు ప్రభుత్వం అందజేసిన గుర్తింపు కార్డు కూడా ఉంది. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీచైర్మన్‌గా ఉన్న సమయంలో సంప్రదాయ కళాకారుల కళలను ప్రదర్శింపజేసి వారికి ప్రశంసాపత్రం, నగదు పురస్కారాలను అందించారు. వారిలో ఈయన కూడా ఉన్నారు. పొదలకూరు యోగాకేంద్రం, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ తదితర సంస్థలు సుబ్బరాయుడుని సత్కరించాయి. కోలాటానికి ఇటీవల ఆదరణ పెరగడంతో ఈయన బృందం పక్క జిల్లాలకు కూడా వెళ్లి ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఊపిరి ఉన్నంత వరకు ప్రదర్శనలు



నా ఊపిరి ఉన్నంత వరకు కోలాటాన్ని శిష్య బృందంతో కలిసి ప్రదర్శిస్తూనే ఉంటాను. శిష్యులే నాకు కొండంత బలం. వారు ఎప్పుడు ఎక్కడకు పిలిచినా వస్తుంటారు. గురువుగా నన్ను గౌరవిస్తూ కళపై మక్కువ పెంచుకుంటున్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి దైవకార్యక్రమాలకు కోలాటం కావాలని ఆడుగుతున్నారు. ఆదరణ పెరుగుతున్నందుకు సంతోషంగా ఉంది.

– చెన్నూరు సుబ్బరాయుడు, కోలాటం గురువు



సుబ్బరాయుడి శిష్య బృందం

పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

...ద్యార్థులకు అవసరమైన ...ం.
...సులకు దుప్పట్లు, దోమతె...

...తీర్చిదిద్దుతాం

...గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా ...ట్టుకున్నాం. అందుకు ఒక ప్రణాళిక ...స్తున్నాం. యువత ముందుకు వస్తేనే ...దుతుందనే అబ్దుల్‌కలాం సందేశాన్ని ...వృద్ధికి కృషి చేస్తున్నాం.

– డీవైఎఫ్ ఫౌండేషన్ సభ్యులు

రబీ సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయండి

▶ కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు(అర్బన్): రబీలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టర్ తన బంగ్లాలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారుల పనితీరుపై ఆయన సమీక్షించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు లేనందున రబీలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచిం చారు. రైతులకు భూసార పరీక్షల కార్డులు నూరు శాతం పంపిణీ చేయాలన్నారు. కార్డులను పంపి ణీ చేయకుండా తప్పుడు నివేదికలు ఇస్తే ఏడీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిప్సం, జింక్‌సల్ఫేట్, బోరాన్‌ను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. పొజిషన్ ఉన్న సీజేఎఫ్‌ఎస్ భూముల రైతులకు రుణ అర్హత కార్డులు జారీ చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. జేసీ–2 వెంకటసుబ్బారెడ్డి, అగ్రికల్చర్ జేడీ చంద్రానాయక్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

భూసేకరణను వేగవంతం చేయాలి

జిల్లాలోని తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ, నీరు–ప్రగతి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాలువ పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ బాధితులకు పరిహారం అందించి భూసేకరణ పూర్తి చేయాలన్నారు.

సోమశిల ఉత్తర కాలువ, కావలి కాలువ పనులు పూర్తి చేయాలన్నారు. చుక్కల భూమిని గుర్తించి ఆక్రమణకు గురైన భూములను క్రమబద్ధీకరించేందుకు నీరు–చెట్టు కింద నిబంధనల ప్రకారం చేయని పనులు రద్దు చేయాలన్నారు. నీరు–ప్రగతి కింద 3765 పనులను రూ.418 కోట్లతో అనుమతించడం జరిగిందన్నారు. 1092 పనులు మాత్రమే పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులు సెప్టంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి, తెలుగు గంగ ఎస్‌ఈ ఏవీ రమణ, ఇరిగేషన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ముందస్తు టీకాలతో గాలికుంటు నుంచి రక్షణ



- 26 నుంచి ఉచిత టీకా కార్యక్రమం
- ఏడీడీఎల్ ఏడీ డాక్టర్ వెంకట్రామ్

నెల్లూరు రూరల్ : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నివారణ టీకాలు వేయించి వాటిని రక్షించుకోవచ్చని జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (ఏడీడీఎల్) అసిస్టెంట్ డైరెక్టర్, డాక్టర్ కె.వెంకట్రామ్ (9989932893) తెలిపారు. జిల్లాలో ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి గిట్టలు ఉన్న పశువులు, గేదెలు, మేకలు, జింకలు, పందులు, ఒంటెలకు ప్రబలుతుందన్నారు. ఈ వ్యాధి సాధారణంగా అక్టోబర్–జనవరి మధ్య కాలంలో వస్తుందని చెప్పారు. ప్రతి ఆరు నెలలకోసారి ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. జిల్లాలో 6,24,654 గేదెలు, 1,15,966 ఆవులు ఉన్నాయని తెలిపారు. వీటికి 7 లక్షల టీకాలను వేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఈ టీకాను ఆరునెలలు వయసు దాటిన ప్రతి పశువుకు వేయవచ్చన్నారు. పాడి, సూడి పశువులకు కూడా వేయవచ్చని పేర్కొన్నారు. రైతులు సకాలంలో తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు, నివారణ గురించి ఏడీ వివరించారు.



వ్యాధి వ్యాప్తి ఇలా: గాలికుంటు వ్యాధి సూక్ష్మజీవులైన పికర్నోవిరిడే కుటుంబానికి చెందిన ఆఫ్తోవైరస్ వలన వస్తుంది. ఓ, ఏ, సీ, ఆసియా –1, సాట్–1,2,3 అనే ఏడు రకాల వైరస్ కారణంగా వస్తుంది. మన దేశంలో ఓ,ఏ, ఆసియా–1తో వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా వస్తుంది. గాలి ద్వారా పశువులకు సోకుతుంది.

వ్యాధి లక్షణాలు

◆ ఈ వ్యాధిలో ఇంకుబేషన్ పీరియడ్ సాధారణ స్థితిలో 2–8 రోజుల వరకు ఉంటుంది. అధిక జ్వరం(104–106 డిగ్రీలు) ఉంటుంది.


గాలికుంటు వ్యాధి లక్షణాలు

◆ వ్యాధి సోకిన పశువు నోరు, నాలుక, గిట్టల మధ్య చీలికలు వచ్చి రక్తంలో చేరి, వైరిమియగా మారి నోటిలోని ఎపిథీలియం కాలి గిట్టలు, పొదుగుపై చేరి బొబ్బలు ఏర్పడతాయి.

◆ నోటిలో పుండ్లు నొప్పిగా ఉండటంతో పశువులు మేత తినవు.

◆ నోటి నుంచి ఎక్కువ లాలాజలం స్రవిస్తూ, పొడుగు తీగవలే వేలాడుతూ పెదవులతో చురుకుగా పెద్ద శబ్దం చేస్తాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.

◆ గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, నొప్పి కలిగి పశువులు సరిగ్గా నడవలేక కుంటుతుంటాయి. చిన్న దూడల్లో ఎటువంటి లక్షణాలు కనిపించకనే చనిపోతుంటాయి.

◆ ఈ వ్యాధి వచ్చి కోలుకున్న పశువులను ఎండలో తిప్పినప్పుడు లేదా మేపినప్పుడు అవి నోటి నుంచి చొంగను కారుస్తూ శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతుంటాయి.

నిర్ధారణ : వ్యాధి లక్షణాలు, క్షాతముల ఆధారంగా నిర్ధారించవచ్చు. అనిమల్ ఇనాక్యులేషన్ పరీక్షలు సీఎఫ్‌టీ, ఏజేపీటీ, ఎన్‌టీ, టీసీ, ఎస్‌ఏటీ, ఎలీసా ద్వారా కూడా నిర్ధారించవచ్చు.

చికిత్స

◆ ఈ వ్యాధికి ప్రత్యేమైన చికిత్స లేదు. వ్యాధి లక్షణాలు, సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ రాకుండా చికిత్స చేసుకోవాలి.

◆ మొదట జ్వరం తగ్గించడానికి యాంటీ పైరెటిక్, యాంటీ బయోటిక్స్ మందులు ఇచ్చి, నొప్పిని తగ్గించడానికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, అనాల్‌జెసిక్ మందులు వాడాలి.

◆ నోటిలో మెగ్నీషియం సల్ఫేట్ ద్రవాన్ని సూదితో పట్టించి తర్వాత పుండ్లను ఒక శాతం పొటాషియం పర్మాంగనేట్ లేదా 5 శాతం బోరిక్ లోషన్‌తో రోజుకు మూడు సార్లు కడగాలి.

◆ కాలిగిట్టలను శుభ్రంగా రెండు శాతం కాపర్ సల్ఫేట్ లోషన్‌తో కడిగి, ఈగలు వాలకుండా నీవ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలో పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిజరిన్ కలిపి పట్టించాలి.

◆ వ్యాధి సోకిన పశువుకు సులభంగా జీర్ణమయ్యే పచ్చిమేతను, బియ్యం గంజిలో కొద్దిగా ఉప్పు కలిపి ఇవ్వవచ్చు.

పశువులకు కలిగే నష్టం

◆ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది.

◆ చూడి పశువులు ఈసుకు పోతాయి.

◆ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేక కుంటుతూ ఇబ్బంది పడుతుంటాయి.

వ్యాధి నివారణ

◆ వ్యాధిగ్రస్త పశువులను మంద నుంచి వేరు చేయాలి.

◆ పరిసరాలను సోడియం హైడ్రాక్సైడ్, ఒక శాతం ఫార్మలిన్, నాలుగు శాతం సోడియం కార్బొనెట్‌తో శుభ్రం చేయాలి.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

రిజిస్ట్రేషన్ కుదేలు

- స్థిరాస్తి విలువలతో తగ్గిన రాబడి
- 15 రోజుల్లో రూ.2 కోట్లకు పైగా ఆదాయానికి గండి

నెల్లూరు(సెంట్రల్): ప్రజలపై భారం మోపి ఆదాయం పెంచుకోవాలని చూస్తున్న రిజిస్ట్రేషన్ శాఖకు భారీగానే షాక్ తగులుతోంది. ఓ వైపు గతేడాది పెద్ద నోట్ల రద్దుతో తగిలిన దెబ్బ నుంచి కోలుకోక ముందే ప్రస్తుతం స్థిరాస్తి విలువల పెంపుతో ఆ శాఖకు మరో దెబ్బ తగిలింది. దీంతో రిజిస్ట్రేషన్ శాఖతో తమ ఆదాయం పెంచుకోవాలనుకున్న ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఈ ఏడాది ఆగస్టులో స్థిరాస్తి విలువను మూడోసారి పెంచడంతో ఆ శాఖకు వచ్చే రాబడిలో చాలా వరకు తగ్గింది. ఒక పక్క రియల్ఎస్టేట్ వ్యాపారం భారీగా నష్టాల్లో ఉన్న సమయంలో స్థిరాస్తి విలువలు పెంచడం ఏ మాత్రం సబబు కాదని ప్రభుత్వం విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో తగ్గిన ఆదాయం

జిల్లాలో నెల్లూరు, గూడూరు అనే రెండు రకాలుగా రిజిస్ట్రేషన్ జిల్లాలు ఉంటాయి. వాటిలో నెల్లూరు పరిధిలో 9, గూడూరు పరిధిలో 10 సబ్‌రిజిస్ట్రార్లు ఉన్నాయి. వీటిలో గతేడాది ఆగస్టు మొదటి వారం నుంచి రెండవ వారం వరకు పరిశీలిస్తే 3407 ఫైళ్ల డాక్యుమెంట్లు కాగా రూ.8.15 కోట్ల రాబడి వచ్చింది. అయితే ఈ ఏడాది మాత్రం స్థిరాస్తి విలువలు పెరగడంతో ఆగస్టు 1 నుంచి 15 వరకు కేవలం 1896 ఫైళ్ల డాక్యుమెంట్లు కాగా రూ.5.6 కోట్ల రాబడి మాత్రమే వచ్చింది. గతేడాది కన్నా ఈ ఏడాదికి 1511 ఫైళ్ల తక్కువగా కాగా రాబడి రూ.2.55 కోట్లు తగ్గింది. ఆదాయం తగ్గుతుండడంతో తమకు ఇచ్చిన టార్గెట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ చేయలేమని సబ్‌రిజిస్ట్రార్లు చేతులెత్తేస్తున్నారు.

రూ.10 కోట్ల భారం

స్థిరాస్తి విలువ పెంపుతో జిల్లా ప్రజలపై రూ.10 కోట్ల భారం పడనుంది. ఈ భారం రూ.1 లక్షకు రూ.7,500గా ఉండనుంది. ఈ విధంగా చూసుకుంటే జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కోట్లలో ప్రజలపై భారం పడినట్లు అర్థమవుతోంది. ప్రధానంగా గ్రామాల్లో కూడా రిజిస్ట్రేషన్ ఫీజులు ఎక్కువగా ఉండడంతో చాలా వరకు క్రయవిక్రయాలు మందగించాయి. అలాగే ఈ పరిణామాల వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కోలుకోలేని దెబ్బ తగులుతోంది. గతేడాది పెద్ద నోట్ల రద్దు నిర్ణయం వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టినవారు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఇప్పుడు స్థిరాస్తి విలువలను పెంచడంతో వారిపై మరింత భారం పడనుంది. ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకునేందుకు తమపై భారం మోపమేంటని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

తగ్గుముఖం నిజమే

స్థిరాస్తి విలువలు పెంచిన తర్వాత రిజిస్ట్రేషన్లు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్లలో పది శాతం కూడా రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. విషయాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతున్నాం. ఏదేమైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మేము పనిచేస్తాం.

– అబ్రహం, జిల్లా రిజిస్ట్రార్

విద్యార్థి వైద్య ఖర్చులకు సాయం

- సామాజిక సేవలో ఆదిశంకర విద్యార్థులు



చెక్కును విద్యార్థి తండ్రికి అందజేస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల విద్యాసంస్థల విద్యార్థులు తమ సహచర విద్యార్థి ఎస్.సుబ్రహ్మణ్యం ఆపరేషన్‌కు అవసరమైన రూ.44,500 మొత్తాన్ని అందజేశారు. సామాజిక సేవా సంఘం(ఆదిశంకర అగాగ్ అలయన్స్) ఏ క్యూబ్ తరపున సేకరించి మంగళవారం విద్యార్థి తండ్రికి కళాశాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.కృష్ణ కుమార్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వీ రమణ ఏ క్యూబ్ విద్యార్థి సంఘాన్ని అభినందించారు.

డ్రాపౌట్స్‌కు సువర్ణావకాశం

కలువాయి(వెంకటగిరి): పాఠశాల, కళాశాల విద్యను మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సువర్ణావకాశం కల్పిస్తోందని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త రమణారెడ్డి అన్నారు. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ఏర్పాటుపై మంగళవారం ఆయన కలువాయిలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సడ్డా జనార్ధనరెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 16 నుంచి 22 వరకు ఓపెన్ స్కూల్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టిందని పేర్కొన్నారు. 14 ఏళ్లు నిండిన వారు ఎవరైనా ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో ప్రవేశం పొందవచ్చన్నారు. అలాగే పది ఉత్తీర్ణులై గ్యాప్ వచ్చిన వారు సింగిల్ సిటింగ్‌లో ఇంటర్ పూర్తిచేయవచ్చన్నారు. వీరికి తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో బోధన జరుగుతుందని, ఇందుకు సంబంధించి జిల్లాలో 56 స్టడీ సెంటర్లు ఉన్నాయని, ఆదివారం, సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తామని వివరించారు. అలాగే ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల వారికి ప్రాక్టికల్స్ కూడా నిర్వహిస్తామన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదివిన వారు రెగ్యులర్‌గా చదివిన వారి మాదిరే అన్ని కోర్సుల్లో చేరేందుకు అర్హత కల్గి ఉంటారని, వారికి ఇచ్చే సర్టిఫికెట్లు రెగ్యులర్ విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లతో సమానమైనవని తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునేవారు టీసీ, ఆధార్, మూడు ఫోటోలతో సంబంధిత స్టడీ సెంటర్లలో నమోదు చేసుకోవాలన్నారు. పదో తరగతికి రూ.1,400, ఇంటర్‌కు రూ.1,600 ఫీజు ఉంటుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ కేటగిరీల వారికి రాయితీ ఉంటుందన్నారు. ఫీజును మీసేవ, ఏపీ ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని, ప్రవేశానికి ఆగస్టు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే రూ.100 అపరాధరుసుంతో సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఈ ఏడాది 9 వేల మందిని ఓపెన్ స్కూల్‌లో చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్‌లో ఎలక్ట్రిసిటీ, టైలరింగ్, డిజైనింగ్, దుస్తుల తయారీ, కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు తన నంబర్ 8008403509కు ఫోన్ చెయ్యొచ్చన్నారు. ఆయన వెంట కలువాయి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు వల్లూరు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పెంచలపుల్లయ్య ఉన్నారు.

మహిళా కార్యకర్తకు అన్యాయం



పిల్లలతో ఇలింద్ర కృష్ణవేణి గుప్తా

కావలి: భర్త చనిపోయి, ఇద్దరు పిల్లలతో పుట్టెడు కష్టాల్లో ఉన్న ఆర్యవైశ్య వివాహితకు టీడీపీ క్రియాశీల సభ్యత్వం ఉన్నప్పటికీ కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా బాధ్యతలు చూస్తున్న నారా లోకేష్ ఆమెను పట్టించుకోలేదు. పోనీ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు తన గోడు వెళ్లబోసుకుందామని వెలగపూడికి వెళ్తే ఆయన పేషీలో ఉన్న అధికారులు ఇక్కడ ఏమీ సహాయం చెయ్యరని చెప్పి పంపేశారు. కావలి పట్టణంలోని కచ్చేరిమిట్టకు చెందిన ఇలింద్ర కృష్ణవేణి గుప్తా పరిస్థితి ఇది. గతంలో ఇలింద్ర వెంకటేశ్వర్లు గుప్తా, కృష్ణవేణి గుప్తా దంపతులు చిన్న బంకు పెట్టుకుని జీవించేవారు. వారికి భావన, భరత్ అనే ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు గుప్తా 2016 ఏప్రిల్ 21న రోడ్డు ప్రమాదంలో గాయపడి, కోమాలో వెళ్లిపోయాడు. అతని వైద్యం కోసం కృష్ణవేణి లక్షలాది రూపాయలు అప్పులు చేసింది. అయినప్పటికీ అతను 2016 మే 11న మరణించాడు. అనంతరం 2016 డిసెంబర్ 8న కృష్ణవేణి టీడీపీలో క్రియాశీలక సభ్యురాలుగా రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. తర్వాత అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు తనకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తారని ఆశించి, పలుమార్లు వారి చుట్టూ తిరిగారు. కానీ వారు ఆమెకు ఏవిధంగానూ సహకరించలేదు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు గుప్తా వైద్యం కోసం చేసిన చేసిన అప్పులు చెల్లించమని, డబ్బులు ఇచ్చిన వారు ఆమెపై ఒత్తిడి చేశారు. దీనికి తోడు కుటుంబ పోషణ కూడా కష్టమవడంతో నేరుగా ముఖ్యమంత్రినే కలిసి తన గోడు చెప్పుకోవాలని నిర్ణయించుకుంది. అలా సోమవారం తన ఇద్దరు పిల్లలను తీసుకుని వెలగపూడిలోని సీఎం కార్యాలయానికి వెళ్లి, సీఎం పేషీలోకి వెళ్లడానికి సెక్యూరిటీ నుంచి పాసులు తీసుకుంది. అయితే పేషీలో ఉన్న అధికారులు ఆమె గురించి ఆరా తీశారు. సీఎం ద్వారా ఎటువంటి సహాయం అందదని చెప్పి వెళ్లిపొమ్మన్నారు. కనీసం చంద్రబాబుతో తన గోడు చెప్పుకుంటానని ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదు. దీంతో చేసేది లేక ఉసూరుమంటూ కన్నీటిపర్యంతమై పిల్లలను తీసుకుని కావలికి చేరుకుంది.

పింఛన్ కూడా రద్దవుతుందన్నారు

ముఖ్యమంత్రి వద్ద రూ.5000 మాత్రమే ఆర్థిక సహాయం అందుతుందని, వాటిని తీసుకుంటే నాకు ఇస్తున్న వితంతువు పింఛన్ రద్దవుతుందని పేషీలోని అధికారులు చెప్పారు. దీంతో భయపడి వెనక్కి వచ్చేశాను.

– ఇలింద్ర కృష్ణవేణి గుప్తా

జంతు కళేబరాలతో నూనె తయారీని ఆపేయాలి

- ఫ్యాక్టరీ వద్ద మేకనూరు గ్రామస్తుల ధర్నా



ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు, సర్పంచ్

గూడూరు రూరల్: గూడూరు మండలంలోని మేకనూరు సమీపంలో ఏర్పాటు చేసిన ఓ ఫ్యాక్టరీలో జంతు కళేబరాలతో నూనె తయారీనీ వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు తమ ముఖాలకు గుడ్డలు కట్టుకుని మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలతో దుర్వాసన వస్తోందన్నారు. దీంతో స్థానికులు వ్యాధుల బారినపడుతున్నారన్నారు. ఆ ఫ్యాక్టరీని మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమరేంద్ర పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని పరిశీలించిన తహసీల్దార్

ఫ్యాక్టరీ వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామని, చర్యలు తీసుకోవాలని మేకనూరు గ్రామస్తులు ఆర్డీఓ పి.అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ జి.వెంకటేశ్వర్లు ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. అయితే అక్కడ గోదాములో జంతు కళేబరాలు, వ్యర్థాలు ఉండడాన్ని గుర్తించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఫ్యాక్టరీలో జంతు కళేబరాలైన గొంతు, స్వరపేటికలతో నూనె తయారు చేసి తద్వారా సల్ఫేట్ పౌడర్ తయారు చేస్తున్నారన్నారు. నీరు, గాలి కలుషితం కావడంతో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందన్నారు.

మూతపడిన బ్యాంకులు



బృందావనంలోని ఆంధ్రాబ్యాంక్ మెయిన్‌బ్రాంచ్ వద్ద ఆందోళన చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

నెల్లూరు(బృందావనం): కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక బృందావనంలోని ఆంధ్రాబ్యాంక్ మెయిన్‌బ్రాంచ్ వద్ద వివిధ బ్యాంకుల ఉద్యోగులు ధర్నా చేపట్టారు. అనంతరం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల భవిష్యత్తులో బ్యాంకుల మనుగడ ప్రశ్నార్థకం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి నుంచి ప్రజాసొమ్మును రికవరీచేయాలన్నారు. అలాగే బ్యాంక్ ఖాతాదారులపై విధించిన సేవా చార్జీలను తక్షణమే ఉపసంహరించి, వారిపై ఆర్థికభారం తగ్గించాలన్నారు. ఈ ఆందోళనలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అంకయ్య, ఎన్‌సీబీఈ ప్రాంతీయ కార్యదర్శి శ్రీనివాస్, ఏఐబీఓసీ కార్యదర్శి కుమార్‌రాజా, బీఈఎఫ్ఐ నాయకులు భాస్కర్, కార్పొరేషన్ బ్యాంక్ జోనల్ కార్యదర్శి రామ్మోహన్, భాస్కరరెడ్డి, ఆనందరామ్‌సింగ్, నాగభూషణం, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, సుమన్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాల మద్దతు

బ్యాంక్ ఉద్యోగులు తలపెట్టిన ఒక రోజు సమ్మెకు వివిధ కార్మిక సంఘాలకు చెందిన నాయకులు మద్దతు పలికారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు, ఎల్ఐసీ నెల్లూరు డివిజన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి జి.నగేష్, ఇతర యూనియన్లకు చెందిన జిల్లా నాయకులు కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, కె.సురేష్ పాల్గొన్నారు.

నిలిచిపోయిన లావాదేవీలు

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపుకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాలకు చెందిన 341 బ్యాంకులు మూతపడ్డాయి. కాగా ప్రైవేట్ సెక్టార్‌కు సంబంధించిన యాక్సిస్, కొటక్ మహీంద్ర, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్‌లో సమ్మెలో పాల్గొనలేదు. సమ్మె కారణంగా క్యాష్, క్లియరింగ్‌కు సంబంధించి ఆయా బ్యాంకుల్లో మంగళవారం రూ.4500 కోట్ల లావాదేవీలు నిలిచిపోయినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

పాడి అభివృద్ధికి పశుగ్రాస క్షేత్రాలు

- జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ రవీంద్రనాథ్ ఠాగూర్

నెల్లూరు రూరల్ : పాడి పశువులకు పశుగ్రాస కొరతను తీర్చేందుకు గ్రామాల్లో పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రైల్వేఫీడర్స్ రోడ్డులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 4,700 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో ఐదెకరాల్లో పచ్చిగడ్డి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఆర్‌డీఏ సహకారంతో ఉపాధి హామీ పథకం కింద ఎకరా గడ్డి సాగుకు రూ.37 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. పాడిరైతులకు కిలో పచ్చిగడ్డి రూపాయికే అందజేస్తామన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌లో పాడి గేదెల సంరక్షణకు క్షీరసాగర, దూడల సంరక్షణకు సునందిని పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

మృతుడు మూలాపేట వాసి

నెల్లూరు సిటీ: నగరంలోని ఎస్2 థియేటర్ ఎదురుగా ఆదివారం రాత్రి రైలు ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి మూలాపేటకు చెందిన పీ రాజయ్యగా మంగళవారం రైల్వే పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు..నగరంలోని మూలాపేటలోని కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన పీ రాజయ్య(58) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఆరోగ్యం సరిగా లేదని వైద్యుడి వద్దకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తెలిసిన వారిని విచారించిన ఆచూకీ తెలియలేదు. పత్రికల్లో వచ్చిన వార్తలను చూసిన కుటుంబసభ్యులు రైల్వేపోలీసులను కలిశారు. ప్రభుత్వాస్పత్రిలోని మృతదేహాన్ని చూపగా రాజయ్యదిగా గుర్తించారు. ప్రమాదవశాత్తు మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జోసఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టిన రోజు



నెల్లూరు(బృందావనం): ఆల్ ఇండియా చిరు యువత వైస్‌ప్రెసిడెంట్ పావు జెన్ని చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగనాయకులపేట రైల్వేగేట్ వద్ద అభిమానులు భారీ కేక్‌ను కట్ చేశారు. చిరంజీవి యువత నాయకులు రవికుమార్, వెంకట్రావ్, రాము, గణేష్, నరేష్, సుమన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దివ్యాంగులకు సకాలంలో ధ్రువీకరణపత్రాలు

నెల్లూరు(బారకాసు): సదరమ్ క్యాంపునకు హాజరైన దివ్యాంగులకు సకాలంలో ధ్రువీకరణపత్రాలు జారీ చేయడం జరుగుతుందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్) అభివృద్ధి కమిటీ చైర్మన్ చాట్ల నరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆస్పత్రిలోని సదరమ్ క్యాంపు, ఐసీయూ వార్డు,ఎక్స్‌రే, సీటీస్కాన్ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెవిటికి సంబంధించి మిషన్ లేకపోవడంతో 3 నెలలుగా సర్టిఫికెట్స్ ఇవ్వలేకపోవడం జరిగిందన్నారు. చెవిటి మి షన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధాకృష్ణరాజు, ఆర్ఎంఓ వరప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ కళారాణి ఉన్నారు.

నాన్నా వెళ్లిపోతున్నా

తండ్రికి ఫోన్ చేసి రైలు కింద యువకుడి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: నాన్నా వెళ్లిపోతున్నా అంటూ తండ్రికి చివరి సారిగా ఫోన్ చేసి ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్2 థియేటర్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు..చింతారెడ్డిపాళేనికి చెందిన కాయల రాజు కుమారుడు శ్రీకాంత్(22) ఇంటర్ మధ్యలో చదువు ఆపేసి చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం నెల్లూరుకు చేరుకున్న శ్రీకాంత్ రాత్రి తన తండ్రికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని, బైక్‌ను జయభారత్ ఆస్పత్రి వద్ద పార్కింగ్ చేశానని, వచ్చి తీసుకెళ్లాలని ఫోన్‌కట్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన తండ్రి రాజు నగరంలోని శ్రీకాంత్ స్నేహితులకు ఫోన్ చేశారు. శ్రీకాంత్ స్నేహితులు పట్టాలపై వెతకగా ఎస్2 థియేటర్ వద్ద శ్రీకాంత్ మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కలెక్టర్ ముత్యాలరాజు



మత్స్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు(అర్బన్): విద్యుత్ బిల్లుల ఆధారంగా ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ ముత్యాలరాజు సూచించారు. మంగళవారం కలెక్టర్ తన కార్యాలయంలో మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. జీపీఎస్ సదుపాయం ఎన్ని చెరువులకు ఏర్పాటు చేశారో అడిగి తెలుసుకున్నారు. చేపల వేట నిషేధ పరిహారంపై చర్చించారు. జువ్వలదిన్నెలో ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ హార్బర్, నగరంలోని 52వ డివిజన్‌లో ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ మార్కెట్ పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జేడీ సాల్మాన్‌రాజు, సహాయ సంచాలకులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

పండ్లతోటలు సాగు చేస్తున్న రైతుల రిజిస్ట్రేషన్లను పూర్తి చేయించాలని ఉద్యానశాఖ అధికారులను కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఉద్యాన శాఖ, డీఆర్డీఏ, ఏపీఎంఐపీ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిపాలనా అనుమతులు, బయోమెట్రిక్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణరావు, డీఆర్డీఏ పీడీ లావణ్యవేణి, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు ఉమాదేవి, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాను ఎడారిగా మారుస్తున్న కర్ణాటక

- జలదోపిడీపై కేంద్రం జోక్యం చేసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిడతల రమేష్

నెల్లూరు(బారకాసు): కర్ణాటక రాష్ట్రం జల దోపిడీకి పాల్పడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఎడారిగా మారుస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ ఆరోపించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఆల్మట్టి డ్యామ్‌లో 129 టీఎంసీల నీటిని నిల్వ చేసుకుని 500 చెరువులకు అక్రమంగా ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని మళ్లించుకుంటుందన్నారు. కర్ణాటక జల దోపిడీపై కేంద్ర జలసంఘం జోక్యం చేసుకుని ఆల్మట్టి నుంచి తెలుగు రాష్ట్రాల్లోని 35లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెన్నా ఉపనదులపై ఏడు ప్రాజెక్టులు అక్రమంగా నిర్మించి సోమశిలకు వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటుందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా జలాలను ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు పంచుకోవాలని కృష్ణా రివర్ బోర్డు ఆదేశించిందన్నారు. అయితే కర్ణాటక శ్రీశైలంకు నీరు విడుదల చేయకుంటే 800 టీఎంసీల నీటి అవసరాలను పంచుకోవడం సాధ్యం కాదన్నారు. కృష్ణా బేసిన్‌ను ఒకే యూనిట్‌గా పరిగణించి కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణాకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ అధినాయకుల దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు వేణు, కొండయ్య, శ్రీహరి, సుబ్బారెడ్డి, వెంకటరత్నం, సురేష్‌నాయుడు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగ బోరు బావులను పూడ్చేయండి

నెల్లూరు(పొగతోట): నిరుపయోగ బోరు బావులను వారం రోజుల్లో పూడ్చివేసేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ హరిత సూచించారు. మంగళవారం ఆమె డ్వామా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 20 వేలకు పైగా బోరుబావులు నిరుపయోగంగా ఉన్నట్లుగా తేలిందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు వారం రోజుల్లో బోర్లను పూడ్చివేయడంపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వీఆర్వోలు, ఎఫ్ఏలు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలు జరిగితే సంబంధిత సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఎఫ్ఏలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫెయిల్ అయిన బోర్లను పూడ్చివేతలో బోర్‌వెల్స్ నిర్లక్ష్యం వహిస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. భూగర్భజల శాఖ డీడీ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమలను పూజిద్దాం



మేయర్ అజీజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గణేశ ఉత్సవ సమితి నిర్వాహకులు

నెల్లూరు(పొగతోట): వినాయక చవితికి మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని నగర మేయర్ అబ్దుల్‌అజీజ్ పిలుపునిచ్చారు. నగరంలో చవితి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విక్రమ సింహపురి గణేశ ఉత్సవ సమితి నిర్వాహకులు మంగళవారం మేయర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 25న పండగ ప్రారంభమయ్యే రోజు నుంచి పెన్నా నదిలో విగ్రహాల నిమజ్జనం చేసే వరకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తామని తెలిపారు. సంతపేట నుంచి పెన్నానది వరకు లైటింగ్ ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉత్సవ సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు. ఉత్సవ విగ్రహాలను స్వాగతించేందుకు పెన్నానదిలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పండగ వాతావరణం కల్పిస్తామన్నారు. ఉత్సవ విగ్రహాల నిమజ్జనాన్ని మహిళలు వీక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఉత్సవ సమితి నిర్వాహకులు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఢిల్లీరావును కలిసి ఏర్పాట్లపై వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేలూరి మహేష్, సమితి నిర్వాహకులు పిట్టి సత్యనాగేశ్వరరావు, దాసరి రాజేష్, మోహన్‌రావు, బాలాజీ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందేలా చర్యలు



ఏడీఏలతో సమావేశమైన జేడీఏ చంద్ర నాయక్

నెల్లూరు రూరల్ : జిల్లాలోని కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ ఆ శాఖ ఏడీఏలకు సూచించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన ఏడీఏలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని 60 వేల మంది కౌలు రైతులకు రెవెన్యూ అధికారుల ద్వారా ఎల్ఈసీ కార్డులు, మండల వ్యవసాయాధికారుల ద్వారా సీఓసీ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సాగుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు ఏ మేరకు అవసరమో గుర్తించాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల కార్డులను రైతులకు అందజేయాలన్నారు. రైతులకు 100 శాతం రాయితీపై జింకు, బోరాన్, జిప్సం సరఫరా చేయాలన్నారు. డీడీఏ విజయ నిర్మల, ఏడీఏలు కన్నయ్య, అనిత, సుమలత, బాలాజీ నాయక్, సత్యవాణి, జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓలు వేణుగోపాల్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల హర్షం



మాట్లాడుతున్న ఈవీఎస్ నాయుడు

నెల్లూరు(బారకాసు): ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టపరమైన హక్కులు కల్పించడానికి అంగీకరిస్తున్నామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడంపై ఆర్ఎంపీ, పీఎంపీల సంఘాలు మంగళవారం హర్షం వ్యక్తం చేశాయి. ఆర్ఎంపీలు, పీఎంపీల సమస్యలపై సీఎం స్పందించడం సంతోషకరమని తెలుగునాడు కమ్యూనిటీ పారామెడిక్స్ అసోసియేషన్(టీఎన్‌సీపీఏ) రాష్ట్ర కోశాధికారి జీ రత్నం పేర్కొన్నారు. టీఎన్‌సీపీఏ ఆధ్వర్యంలో వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సీనియర్ నాయకుడు ఏవీ రమణయ్య, జిల్లా నాయకులు శ్రీనివాసులు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తిస్తే మరింతగా సేవలందిస్తాం

సీఎం చంద్రబాబునాయుడు ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించేందుకు చట్టపరమైన హక్కులు కల్పిస్తామనడం సంతోషకరమని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(పీఎంపీ)జిల్లా గౌరవాధ్యక్షుడు ఈవీఎస్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం బుజబుజ నెల్లూరులోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం గుర్తింపునిస్తే గ్రామీణులకు మరింతగా సేవలందిస్తారన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు శేషయ్య, వీరయ్య, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'రెడ్ రివర్' అని ఏ నదిని పిలుస్తారు?

ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు



జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పశ్చిమ కనుమల్లో జన్మించని నది ఏది?
1) గోదావరి 2) కృష్ణా
3) శరావతి 4) మహానది

2. కృష్ణానది ఏ ప్రాంతంలో సముద్రంలో కలుస్తుంది?
1) అంతర్వేది 2) దివిసీమ
3) హంసలదీవి 4) కృష్ణపట్నం

3. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
1) కోసి నదిని 'బీహార్ దుఃఖదాయని' అని పిలుస్తారు
2) దామోదర్ నదిని 'బెంగాల్ దుఃఖదాయని' అని పిలుస్తారు
3) గండక్ నదిని 'అసోం దుఃఖదాయని' అని పిలుస్తారు
4) భారత్‌లో అతి పొడవైన నది గంగా

4. ప్రపంచంలో అతిపెద్ద డెల్టా అయిన 'సుంద ర్‌బన్స్ డెల్టా' ఏ నదుల వల్ల ఏర్పడింది?
1) సింధూ, బ్రహ్మపుత్ర
2) బ్రహ్మపుత్ర, గంగా
3) సింధూ, గంగా
4) గంగా, యమున

5. కింది వాటిలో ఏ రెండు నదులు దాదాపుగా ఒకే ప్రాంతంలో జన్మిస్తాయి?
1) గంగా, సింధూ
2) గంగా, బ్రహ్మపుత్ర
3) బియాస్, తపతి
4) సింధూ, బ్రహ్మపుత్ర

6. కృష్ణానది జన్మస్థానం ఏది?
1) మానస సరోవరం
2) మహాబలేశ్వరం
3) త్రయంబకేశ్వర్
4) చిక్‌బల్లాపూర్

7. కింది వాటిలో ఉత్తరం వైపు ప్రవహించే నది ఏది?
1) కావేరి 2) నర్మద
3) చంబల్ 4) బ్రహ్మపుత్ర

8. కింది వాటిలో ఉత్తర భారతదేశం నుంచి దక్కన్ పీఠభూమిని విభజించే నది ఏది?
1) చంబల్ 2) కృష్ణా
3) గోదావరి 4) నర్మద

9. 'జయమంగళి' అనేది ఏ నదికి ఉపనది?
1) కృష్ణా 2) తుంగభద్ర
3) మంజీర 4) పెన్నా

10. అలక్‌నంద, భాగీరథి నదులు ఏ ప్రాంతంలో కలుస్తాయి?
1) దేవ ప్రయాగ 2) రుద్ర ప్రయాగ
3) రిషికేష్ 4) కరణ్ ప్రయాగ

11. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
1) కర్ణావతి 2) భాగీరథి
3) జమున 4) పద్మ

12. కింది వాటిలో గంగానది ఒడ్డున లేని నగరం ఏది?
1) వారణాసి 2) అలహాబాద్
3) కాన్పూర్ 4) లక్నో

13. జతపరచండి.
జాబితా-I
i) కుమవున్ హిమాలయాలు
ii) నేపాల్ హిమాలయాలు
iii) పంజాబ్ హిమాలయాలు
iv) అసోం హిమాలయాలు
జాబితా-II
a) ఇండస్, సట్లెజ్ మధ్య
b) కాళీ, తీస్తా మధ్య
c) తీస్తా, బ్రహ్మపుత్ర మధ్య
d) సట్లెజ్, కాళీ మధ్య
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-c, ii-b, iii-d, iv-a
3) i-d, ii-b, iii-a, iv-c
4) i-d, ii-c, iii-a, iv-b

14. సాత్పురా, వింధ్య పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
1) నర్మద 2) గండక్
3) తపతి 4) గోదావరి

15. భారతదేశంలో బ్రహ్మపుత్ర నది మొదట ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది?
1) అసోం 2) త్రిపుర
3) సిక్కిం 4) అరుణాచల్‌ప్రదేశ్

16. కింది వాటిలో పశ్చిమం వైపు ప్రవహిస్తున్న నది ఏది?
1) గోదావరి 2) నర్మద
3) కావేరి 4) కృష్ణ

17. నదులు, వాటి జన్మస్థానాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) జీలం – వెరినాగ్
2) చీనాబ్ – బారాలప్చాలా
3) రావి – రోహ్‌తంగ్ కనుమ
4) సట్లెజ్ – రూపానగర్

18. బ్రహ్మపుత్ర నది భారతదేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తుంది?
1) సిక్కిం, అసోం
2) అసోం, మేఘాలయ
3) అసోం, అరుణాచల్‌ప్రదేశ్
4) అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం

19. 'రెడ్ రివర్' అని ఏ నదిని పిలుస్తారు?
1) గంగా 2) కృష్ణా
3) కావేరి 4) బ్రహ్మపుత్ర

20. 'భీమ' దేనికి ఉపనది?
1) కృష్ణా 2) గోదావరి
3) నర్మద 4) కావేరి

21. గోదావరి నదికి మరో పేరు?
1) ఉత్తర గంగ 2) తూర్పు గంగ
3) దక్షిణ గంగ 4) పశ్చిమ గంగ

22. కింది వాటిలో బంగాళాఖాతంలో కలవని నది ఏది?
1) గోదావరి 2) కృష్ణా
3) తపతి 4) కావేరి

23. లక్నో నగరం ఏ నది ఒడ్డున ఉంది?
1) గోమతి 2) సట్లెజ్
3) గంగా 4) సరయు

24. బ్రహ్మపుత్ర నది పొడవు (సుమారుగా)?
1) 1900 కి.మీ. 2) 2900 కి.మీ.
3) 3900 కి.మీ. 4) 2800 కి.మీ.

25. కింది వాటిలో గోదావరి నది ఉపనది ఏది?
1) ఇంద్రావతి 2) స్వర్ణముఖి
3) చిత్రావతి 4) కుందేరు

26. కింది వాటిలో భారతదేశంలో జన్మించని నది ఏది?
1) బియాస్ 2) చీనాబ్
3) రావి 4) సట్లెజ్

27. జోగ్ జలపాతం ఏ నదిపై ఉంది?
1) తపతి 2) శరావతి
3) కావేరి 4) భీమ

28. వెంబనాడ్, లోక్‌తక్ సరస్సులు వరసగా ఏయే రాష్ట్రాల్లో ఉన్నాయి?
1) తమిళనాడు, రాజస్థాన్
2) కేరళ, మణిపూర్
3) కేరళ, ఒడిశా
4) ఒడిశా, రాజస్థాన్

29. ఆరావళి పర్వతాల్లో జన్మించి, కాంబే గల్ఫ్‌లోకి ప్రవహించే నది ఏది?
1) నేత్రావతి 2) లూని
3) సబర్మతి 4) తపతి

30. కింది వాటిలో 'లూని' నది దేనిలోకి ప్రవహిస్తుంది?
1) గంగాడెల్టా 2) కేరళతీరం
3) కచ్‌తీరం 4) గోదావరి డెల్టా

31. కింది వాటిలో చైనా, భారత్‌లో ప్రవహించే నది ఏది?
1) గంగ 2) యముమన
3) బ్రహ్మపుత్ర 4) దామోదర్ నది

32. శ్రీనగర్ ఏ నది ఒడ్డున ఉంది?
1) రావి 2) సట్లెజ్
3) జీలం 4) చీనాబ్

33. 'లూని' నది జన్మస్థానం ఏది?
1) సాంబార్ సరస్సు
2) అష్టముడి సరస్సు
3) లోనార్ సరస్సు
4) అన్నాసాగర్ సరస్సు

34. దేశంలోని నగరాలు, అవి ఉన్న నదీ తీరాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) అయోధ్య – సరయు
2) సూరత్ – తపతి
3) పనాజి – కావేరి
4) లుథియానా – సట్లెజ్

35. కావేరి నది ఏయే రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది?
1) ఆంధ్రప్రదేశ్, తమిళనాడు
2) కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
3) ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర
4) కర్ణాటక, తమిళనాడు

36. అమరావతి నది ఏ నదికి ఉపనది?
1) కావేరి 2) కృష్ణా
3) పెన్నా 4) గోదావరి

37. కింది వాటిలో సరికానిది ఏది?
1) నర్మదా నది అమర్ కంటక్ వద్ద జన్మిస్తోంది
2) తపతి నది ముల్తాయి వద్ద జన్మిస్తోంది
3) తుంగభద్ర నది నందిదుర్గ కొండల్లో జన్మిస్తోంది
4) మహానది ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం లోని 'శిహవా' ప్రాంతంలో జన్మిస్తోంది

38. తోచి, గిల్గిట్, హుంజా అనేవి ఏ నదికి ఉపనదులు?
1) సింధూ 2) యమున
3) గంగ 4) బ్రహ్మపుత్ర

39. నాసిక్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
1) గోమతి 2) గోదావరి
3) నర్మద 4) తపతి

40. కింది వాటిలో ఏ నది ప్రఖ్యాతి చెందిన 'మార్బుల్ ఫాల్స్'గా తయారవుతోంది?
1) నర్మద 2) తపతి
3) శరావతి 4) కావేరి

41. భారతదేశంలో ఏ నది వల్ల ఎక్కువగా వరదలు సంభవిస్తాయి?
1) గోదావరి 2) గోమతి
3) బ్రహ్మపుత్ర 4) కావేరి

42. కింది వాటిలో ఏ నదీతీరం అత్యధిక నీటి పరీవాహక ప్రాంతాన్ని కలిగి ఉంది?
1) గంగ 2) బ్రహ్మపుత్ర
3) యమున 4) గోదావరి

43. కింది వాటిలో సరికానిది ఏది?
1) కోల్‌కతా – హుగ్లీ
2) మధురై – కావేరి
3) ఢిల్లీ – యమున
4) రూర్కెలా – బ్రాహ్మణి

44. అసోంలో ఏ నది వల్ల తీవ్ర వరదలు సంభవిస్తాయి?
1) గోమతి 2) గంగ
3) బ్రహ్మపుత్ర 4) యమున

45. బ్రహ్మపుత్ర నది జన్మస్థానం ఏది?
1) గంగోత్రి 2) పశ్చిమ కనుమలు
3) టిబెట్ పీఠభూమి
4) పూర్వాంచల్ పర్వతాలు

46. చిత్రావతి ఏ నదికి ఉపనది?
1) పెన్నా 2) గోదావరి
3) కృష్ణా 4) తుంగభద్ర

47. కెన్ నది జన్మస్థానం ఏది?
1) బందార్ పుంచ్ శిఖరం
2) జనసావో కొండలు
3) వరాహ పర్వతాలు
4) కైమూర్ కొండలు

48. కింది వాటిలో సరికానిది ఏది?
1) కెన్‌నదిని 'కర్ణావతి' అని పిలుస్తారు
2) వంశధార నదిని 'లాంగుల్యా' అని పిలుస్తారు
3) గండక్‌నదిని బిహార్‌లో 'నారాయణి' అని పిలుస్తారు
4) బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో 'జమున' అని పిలుస్తారు

49. పూర్ణ, బేతుల్, పాట్కి అనేవి ఏ నదికి ఉపనదులు?
1) మహానది 2) పెన్నా
3) తపతి 4) నర్మద

50. 'నాళ్' సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
1) మహారాష్ట్ర 2) రాజస్థాన్
3) గుజరాత్ 4) జమ్ము-కశ్మీర్

51. కింది వాటిలో సరికానిది ఏది?
1) గౌహతి – బ్రహ్మపుత్ర
2) జంషెడ్‌పూర్ – సువర్ణరేఖ
3) శ్రీరంగపట్నం – పెన్నా నది
4) కటక్ – మహానది

52. బరాకర్, కోనార్ ఏ నదికి ఉపనదులు?
1) మహానది 2) దామోదర్
3) యమున 4) సబర్మతి

53. కింది వాటిలో ఏ నదిని 'నేత్రావతి' అని పిలుస్తారు?
1) బెట్వా 2) చంబల్
3) కోసి 4) యమున

54. చంబల్, బెట్వా, కెన్‌లు ఏ నదికి ఉపనదులు?
1) నర్మద 2) తపతి
3) యమున 4) దామోదర్

55. కింది వాటిలో పెన్నా నదికి ఉపనది కానిది ఏది?
1) కుందేరు 2) సగిలేరు
3) లోకపావని 4) చెయ్యేరు

56. సోన్ నది గంగానదిలో ఎక్కడ కలుస్తుంది?
1) అలహాబాద్ 2) పాట్నా
3) రుద్ర ప్రయాగ 4) చాప్రా

57. నర్మదానది దేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?
1) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
2) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్
3) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
4) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్

58. దిబాంగ్, లోహిత్ ఏ నదికి ఉపనదులు?
1) గంగా 2) సింధు
3) యమున 4) బ్రహ్మపుత్ర

59. గంగా నది ఏ రాష్ట్రంలో అత్యధిక దూరం ప్రవహిస్తోంది?
1) పశ్చిమ బెంగాల్
2) ఉత్తరప్రదేశ్ 3) బిహార్
4) ఉత్తరాఖండ్

60. కింది వాటిలో సరైంది ఏది?
1) దామోదర్ నది చోటానాగ్‌పూర్ పీఠభూమిలోని 'టోరి' అనే ప్రాంతంలో జన్మిస్తోంది
2) చంబల్ నది మధ్యప్రదేశ్‌లోని 'మౌ' అనే ప్రదేశంలో జన్మిస్తోంది
3) పెన్నా నది కర్ణాటకలో నంది దుర్గ కొండల్లో జన్మిస్తోంది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 4	2) 3	3) 3	4) 2	5) 4
6) 2	7) 3	8) 4	9) 4	10) 1
11) 4	12) 4	13) 3	14) 1	15) 4
16) 2	17) 4	18) 3	19) 4	20) 1
21) 3	22) 3	23) 1	24) 2	25) 1
26) 4	27) 2	28) 2	29) 3	30) 3
31) 3	32) 3	33) 4	34) 3	35) 4
36) 1	37) 3	38) 1	39) 2	40) 1
41) 3	42) 1	43) 2	44) 3	45) 3
46) 1	47) 4	48) 2	49) 3	50) 3
51) 3	52) 2	53) 1	54) 3	55) 3
56) 2	57) 3	58) 4	59) 2	60) 4

What is the percentage earning..



N. Vinaykumar Reddy
Director, IACE,
Hyderabad.

Model Questions

Directions (Q.No. 1 - 5) In each of these questions two equations are given. You have to solve these equations and give answer.

a) If $x < y$ b) If $x > y$
c) If $x = y$ d) If $x \geq y$
e) If $x \leq y$

1. I. $x(x + 7) = 30$
II. $y = \left(\frac{100}{9}\right)^{1/2}$

2. I. $3x^2 - 16x + 21 = 0$
II. $6y^2 + 25y + 21 = 0$

3. I. $2x^5(x^{-2}) = 128$
II. $\frac{1}{3}y^9 = \frac{1}{24}y^{11}$

4. I. $20x^2 - 108x + 144 = 0$
II. $25y^2 - 90y + 72 = 0$

5. I. $2x^2 + 18x + 36 = 0$
II. $y^2 - 3y - 18 = 0$

6. Ram sold an article with 2.5% loss. If he sold it 100/- more then Ram get 7.5% profit. What will be the selling price of article if Ram wants to earn 12.5% profit?
a) 1200 b) 1000
c) 1205 d) 1125
e) None of these

7. A takes 4 days to complete 1/3rd of a job. B takes 3 days to complete 1/6th of the same work and C takes 5 days to complete half of the job. If all of them work together for 3 days and A & C quit, how long will it take for B to complete the remaining work done?
a) 6 days b) 8.1 days
c) 5.1 days d) 7 days
e) None of these

8. Arun borrowed a sum of money from Jayant at the rate of 8% per annum simple interest for the first four years, 10% per annum for the next 6 years and 12% per annum for the period beyond 10 years. If he pays a total of Rs. 12160 as interest only at the end of 15 years, how much money



IBPS RRB Special
Quantitative Aptitude

did he borrow?
a) Rs. 8000
b) Rs. 10000 c) Rs. 12000
d) Rs. 9000
e) None of these

9. Kalyani took a loan at simple interest rate of 6% in the first year with an increase of 0.5 % in each subsequent year. She paid interest of Rs. 3375 after 4 years. How much loan did she take?
a) Rs. 15000
b) Rs. 12500 c) Rs. 16000
d) Rs. 12000
e) None of these

10. Peter earned 50% more than sum of Ravi and Rajesh whereas Rajesh earnings are one third of that of Peter. What is the percentage earning of Ravi more than Rajesh?
a) 10% b) 15%
c) 50% d) 0%
e) 100%

11. In one litre of mixture of alcohol and water, water is 30%. The amount of alcohol that must be added to the mixture, so that the part of water in the mixture becomes 15%, is:
a) 1000 ml b) 700 ml
c) 300 ml d) 900 ml
e) None of these

12. A box contains 2 blue caps, 4 red caps, 5 green caps and 1 yellow cap. If one cap is picked at random, what is the probability that it is either blue or yellow?
a) $\frac{2}{9}$ b) $\frac{1}{4}$
c) $\frac{3}{8}$ d) $\frac{6}{11}$
e) None of these

13. A and B enter into a partnership with their capitals in the ratio 3 : 5. At the end of 4 months, A withdraws his capital. If they receive the profits in the ratio 4 : 5, find how long B's capital was used?
a) 2 months
b) 5 months c) 4 months
d) 3 months
e) None of these

14. The cost price of article B is 20% more than that of article A. Articles A and B were marked up by 50% and 25% respectively. Article A was sold at discount of 5% and article B was sold at a discount of 9%. If the selling price of article A was Rs. 30/- more than the selling price of article B, what was the cost price of article A?
a) Rs. 600/- b) Rs. 400/-
c) Rs. 500/- d) Rs. 540/-
e) None of these

Directions (Q. No. 15-19) : What should came in place of the question mark (?) in the following number series?

15. 6, 7, 16, 51, 208, ?, 6276
a) 1045 b) 941
c) 836 d) 1254
e) None of these

16. 3, 5, 8, 12, 17, ?, 30
a) 25 b) 27
c) 22 d) 24
e) None of these

17. 1, 8, 27, 64, ?, 216, 343
a) 145 b) 160
c) 125 d) 180
e) None of these

18. 4, 6, 12, ?, 90, 315, 1260
a) 42 b) 36
c) 24 d) 30
e) None of these

19. 18, 21, 16, 23, 12, 25, ?
a) 24 b) 8
c) 14 d) 10
e) None of these

Key & Solutions

1. I. $x^2 + 7x - 30 = 0$
$x^2 + 10x - 3x - 30 = 0$
$x(x + 10) - 3(x + 10) = 0$
$x = -10, 3$
II. $y = \sqrt{\frac{100}{9}} = \frac{10}{3} = 3.33$
Hence, $x < y$ ***Ans: a***

2. I. $3x^2 - 16x + 21 = 0$
$3x^2 - 9x - 7x + 21 = 0$
$(3x - 7)(x - 3) = 0$
$x = 3, \frac{7}{3}$
II. $6y^2 + 25y + 21 = 0$
$6y^2 + 18y + 7y + 21 = 0$
$y = -\frac{7}{6}, -3$
Hence, $x > y$ ***Ans: b***

3. I. $2x^5 (x^{-2}) = 128$
$2x^3 = 128$
$x = 4$
II. $y^9 = \frac{y^{11}}{8}$
$8 = y^2$
$y = 2\sqrt{2}$
Hence, $x > y$ ***Ans: b***

4. I. $20x^2 - 108x + 144 = 0$
$20x^2 - 60x - 48x + 144 = 0$
$20x (x - 3) - 48(x - 3) = 0$
$x = 3, 2.4$
II. $25y^2 - 90y + 72 = 0$
$25y^2 - 60y - 30y + 72 = 0$
$5y (5y - 12) - 6(5y - 12) = 0$
$y = 2.4, 1.2$
Hence, $x \geq y$ ***Ans: d***

5. I. $2x^2 + 18x + 36 = 0$
$x^2 + 9x + 18 = 0$
$x^2 + 6x + 3x + 18 = 0$
$x(x + 6) + 3(x + 6) = 0$
$x = -6, -3$
II. $y^2 - 3y - 18 = 0$
$y^2 - 6y + 3y - 18 = 0$
$y(y - 6) + 3(y - 6) = 0$
$y = 6, -3$
Hence, $x \leq y$ ***Ans: e***

6. $\frac{107.5}{100}C - \frac{97.5}{100}C = 100$
∴ C = 1000
∴ Selling price
$= \frac{112.5}{100}\times C \Rightarrow \frac{112.5}{100}\times 1000 \Rightarrow 1125$
Ans: d

7. A ⇒ $\frac{1}{3}$rd work in 4 days
A ⇒ total work in
3 × 4 = 12 days.
B ⇒ $\frac{1}{6}$th work in 3days
B ⇒ total work in
6 × 3= 18 days
C ⇒ half the work in 5 days
C ⇒ total work in
2 × 5 = 10 days
LCM of 12, 18, 10 is 180 units
A's 1 day's work = 15 units
B's 1 day's work = 10 units
C's 1 day's work = 18 units
A, B and C's 3 day's work = 3 (15 + 10 + 18) = 129 units
Remaining work = 180 – 129 = 51 units
B completes the remaining work in 5.1 days.
Ans: c

8. (4 years) (6 years) (5 years)
8 × 4 + 10 × 6 + 12 × 5
32 + 60 + 60 = 152%
152% ⇒ 12,160
Principle ⇒ 100%
$=12160\times\frac{100}{152}=8000$ ***Ans: a***

9. Total interest % = 6 + 6.5 + 7 + 7.5 = 27%
∴ 27% ⇒ 3375
Principle ⇒ 100%
$=\frac{3375\times100}{27}=12500$ ***Ans: b***

10. $\text{Peter} = \frac{150}{100}(\text{Ravi} + \text{Rajesh}) \rightarrow (1)$
$\text{Rajesh} = \frac{\text{Peter}}{3} \rightarrow (2)$
By substituting eq. (2) in (1)
3Rajesh = 1.5 Ravi +1.5 Rajesh
1.5 Ravi = 1.5 Rajesh
Ravi = Rajesh
Their earnings are equal.
Ans: d

11. In 1000 ml of mixture
Alcohol = 700 ml
Water = 300 ml
Let x ml of alcohol is mixed
According to question
$=\frac{300}{1000+x}\times100=15\Rightarrow x=1000\text{ml}$
Ans: a

12. 2B, 4R, 5G, 1Y
$P(B \text{ or } Y) = \frac{2C_1}{12C_1}+\frac{1C_1}{12C_1}=\frac{2}{12}+\frac{1}{12}$
$=\frac{3}{12}\Rightarrow\frac{1}{4}$ ***Ans: b***

13. A : B
3 × 4 : 5 × t
Profit ratio = $\frac{4}{5}$
$\Rightarrow \frac{12}{5t} = \frac{4}{5}$
t = 3 months ***Ans: d***

14. Let the cost price of article A = Rs. x
Cost price of article
$B = x\times\frac{120}{100}=\frac{6x}{5}$
Marked price of article
$A = x\times\frac{150}{100}=\frac{3x}{2}$
Marked price of article
$B = \frac{6x}{5}\times\frac{125}{100}\Rightarrow\frac{3x}{2}$
According to question,
$\frac{3x}{2}\times\frac{95}{100}-\frac{3x}{2}\times\frac{91}{100}=30$
$\frac{3}{2}x\times\frac{4}{100}=30$
∴ x = Rs.500/- ***Ans: c***

15. 6 → 7 → 16 → 51 → 208 → **?=1045** → 6276
(+1)×1, (+1)×2, (+1)×3, (+1)×4, (+1)×5, (+1)×6
∴ ? = (208 + 1) × 5 = 1045
Ans: a


16. 3 → 5 → 8 → 12 → 17 → **? = 23** → 30
+2, +3, +4, +5, +6, +7
∴ ? = 17 + 6 = 23 ***Ans: e***

17. $1 \Rightarrow 1^3$, $8 \Rightarrow 2^3$, $27 \Rightarrow 3^3$,
$64 \Rightarrow 4^3$, $? = 5^3 \Rightarrow 125$
$216 \Rightarrow 6^3$, $343 \Rightarrow 7^3$
∴ $? = 5^3 = 125$ ***Ans: c***

18. 4 → 6 → 12 → **?=30** → 90 → 315 → 1260
×1.5, ×2.0, ×2.5, ×3.0, ×3.5, ×4
∴ ? = 12 × 2.5 = 30
Ans: d

19. 18 → 21 → 16 → **23** → 12 → 25 → ?=8
+3, -5, +7, –11, +13, –17
Here 3, 5, 7, 11, 13, 17 are prime numbers
∴ ? = 25 – 17= 8 ***Ans: b***

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





నాన్నా చెప్పవా?


ఒంటె పాలను తాగవచ్చా?



ఆవుల పాలకన్నా ఒంటె పాలు పుష్టిని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అందుకే ఒంటెలను పెంచే ప్రాంతాలలో చాలా మంది తమ పిల్లలకు ఒంటె పాలను తాగిస్తుంటారు. ఆవు పాలతో పోల్చినప్పుడు ఒంటె పాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఒంటెలు ఎడారుల వంటి చాలా కఠోరమైన పరిసరాలలో జీవించే కారణంగా అవి తమ సంతానం కోసం అనేకవిధాలుగా మేలు చేసే పాలను ఉత్పత్తి చేసి అందిస్తాయి. ఆవుపాలు కేవలం 12 గంటలలోనే పులిసిపోతే ఒంటె పాలు మాత్రం రెండు రోజులపాటు (48 గంటలు) పాడవకుండా ఉంటాయి. రుచిలో ఆవుపాల కొంచెం ఉప్పగా ఉండే ఒంటె పాలు పోషకాల విషయంలో మాత్రం చాలా సుసంపన్నంగా ఉంటాయి. ఆవుపాలలోకన్నా ఒంటె పాలలో సి–విటమిను 3 రెట్లు ఎక్కువగాను, ఇనుము 10 రెట్లు ఎక్కువగాను ఉంటాయి. అదేవిధంగా ఆరోగ్యకరమైన ఆమ్లాలు బి–విటమిన్ కూడా ఒంటె పాలలో పుష్కలంగాఉంటాయి. వ్యాధి కారక సూక్ష్మజీవులకు, వైరస్‌లకు వ్యతిరేకంగా పని చేసే స్వభావం ఆవుపాలలోకన్నా ఒంటె పాలలో పది రెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే ఆవుపాలలో కొవ్వు శాతం 4.5% ఉంటే ఒంటె పాలలో అది కేవలం 2% మాత్రమే ఉంటుంది. ఇలా ఒక పక్క వివిధ పోషకాలను, విటమిన్లను పుష్కలంగా కలిగి ఉంటూ మరోపక్క హానికారకమైన కొవ్వులాంటి పదార్థాలు తక్కువగా ఉండే కారణంగా డయాబెటిస్, గుండె జబ్బులు వంటివి ఉన్న వారికి గతంలో పోషకాహార లోపంతో శరీరం క్షీణించిన వారికి, రోగ రోధక శక్తి తక్కువగా ఉండి అది పెంచుకోవలసిన అవసరం ఉన్న వారికి ఒంటెపాలు చాలా మంచివని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు. కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ... జీర్ణకోశంలో వచ్చే గడ్డలు, ఇతర అపసవ్యతలు, జలుబు, క్షయ, ఉబ్బసం, రికెట్స్, హెపటైటిస్ వంటి పలు రుగ్మతలను నయం చేసుకునేందుకు ఒంటెపాలను ఓ చక్కటి ఔషధంలా వాడుకుంటారు.

మీకు తెలుసా?

మిడత వెనకకాళ్లను తరుచూ తడిమితే మనతో స్నేహం చేస్తుంది



బ్రిటన్‌లో 90% జనాభా వారంలో కనీసం ఒక్కసారైన పిజ్జా తింటారు



1939లో సంభవించిన ఒక్క ఉరుముతోనే 835 గొర్రెలు చనిపోయాయి




నీడలను గుర్తించండి


పైన కొన్ని బొమ్మలు ఉన్నాయి. కింద వేరు వేరు స్థానాల్లో వాటి నీడలు ఉన్నాయి. ఏ బొమ్మ నీడ దేనిదో గుర్తించి బొమ్మలతో వాటి నీడలను జతచేయండి.




లెక్కించండి.. రంగులు వేయండి

ఇక్కడ ఉన్న బొమ్మలో ఏవి ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.





కింద ఇచ్చిన ఏనుగు బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



SAKSHI arena one School fest

Brought to you by Dukes Waffy

Associate Sponsor DELHI PUBLIC SCHOOL

చిన్నారుల ప్రతిభకు పట్టం

త్వరలో 'సాక్షి ఎరీనా వన్ స్కూల్ ఫెస్ట్'

రిజిస్ట్రేషన్లకు గడువు సెప్టెంబర్ 10

స్కూల్ విద్యార్థులారా! మీలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు చక్కటి అవకాశాన్ని 'సాక్షి' కల్పిస్తోంది. చదువుతో పాటు, క్రీడలు, సృజనాత్మక అంశాల్లో మీ టాలెంట్‌ను నిరూపించుకోవచ్చు.'సాక్షి ఎరీనా వన్ స్కూల్ ఫెస్ట్'లో మీ సామర్థ్యాన్ని ప్రదర్శించవచ్చు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, మిమ్మల్ని ప్రపంచానికి సాక్షి పరిచయం చేస్తుంది. ముందుగా మీరు చేయాల్సిందల్లా జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వడమే. ఆపై రాష్ట్ర స్థాయిలో పోటీ పడతారు. విజేతలకు మెడల్స్/ట్రోఫీలతో పాటు పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తారు. ఒక్కో పోటీ అంశానికి సోలో/ గ్రూప్‌ని బట్టి రూ. 50 నుంచి 1000 వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

పోటీలు

సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్ బీ

SAKSHI INDIA SPELL Bee 2017 SAKSHI MATH BEE

ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు అర్హులు. ఈ పోటీలు నాలుగు కేటగిరీలుగా జరుగుతాయి. మొదటి విజేతకు గోల్డ్‌మెడల్‌తో పాటు రూ. 15 వేలు, ద్వితీయ విజేతకు రజత పతకంతో పాటు రూ. 10 వేలు, తృతీయ విజేతకు కాంస్య పతకంతో పాటు రూ. 5 వేలు నగదు అందజేస్తారు.

- క్రియేటివ్ ఎరీనా - 'పోస్టర్ మేకింగ్'
- లిటరరీ - 'ఆర్టికల్ రైటింగ్, హ్యాండ్ రైటింగ్, ఎల్లోకేషన్
- ఫైన్ ఆర్ట్స్ - 'పెయింటింగ్'
- పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ - 'డ్యాన్స్ (సోలో/గ్రూప్)', సింగింగ్
- స్పోర్ట్స్ - 'క్రికెట్ (టీమ్), క్యారమ్స్ (సింగిల్/డబుల్స్), చెస్, బాడ్మింటన్ (సింగిల్/డబుల్స్), టేబుల్ టెన్నిస్ (సింగిల్/డబుల్స్)

రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాలకోసం...

Sakshi Office, Shop No-16-10-75, 3rd Floor, Srija Nilayam, Opp:TDP Office, Back side Sravanya Hotel, Mini bypass road, Nellore. Prasad-99516 02922కు కాల్ చేయవచ్చు

అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీల విజేత ఆరంబాకం

వాకాడు: మండలంలోని శ్రీనివాసపురంలో ఎస్ఈపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీల్లో ఆరంబాకం జట్టు విజేతగా నిలిచింది. ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 84 మత్స్యకార జట్లు హాజరుకాగా సోమవారం రాత్రి జరిగిన ఫైనల్లో ఆరంబాకం జట్టు విజేతగా నిలిచి రూ.50వేలు నగదు బహుమతిని కైవసం చేసుకుంది. శ్రీనివాసపురం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుని రూ.40 వేలు, రూ.30వేలు నగదు అందుకున్నాయి. కొండూరుపాళెం జట్టు నాల్గో స్థానంలో నిలిచి రూ.20వేలు నగదు అందుకుంది.

అశ్వ వాహనంపై వెంకయ్యస్వామి



గొలగమూడి(వెంకటాచలం): గొలగమూడిలోని వెంకయ్యస్వామి మందిరంలో జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకయ్యస్వామి అశ్వవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మందిరంలో వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. అశ్వవాహనసేవకు నెల్లూరుకు చెందిన వేమూరు కిషోర్‌కుమార్ ,అరుణలత దంపతులు, నావూరుపల్లెకు చెందిన శ్రీధర్, అరుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా పెదశేషవాహనసేవ

ఆరాధనోత్సవాల్లో భాగంగా రాత్రి పెద శేషవాహనసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. వెంకయ్యస్వామిని పెదశేషవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. ముత్తుకూరుకు చెందిన ఈదూరు రామ్మోహనరెడ్డి, సుప్రియ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భాగవతారిణి భవానీబాయి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర హరికథాగానం చేశారు. బాలాజీ నాట్యమండలి కురుక్షేత్ర నాటకాన్ని ప్రదర్శించారు.


ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో బుధవారం ఉదయం సింహ వాహన సేవ, రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు.

SAKSHI MEDIA GROUP www.sakshi.com

సెల్ఫీ విత్ గణేశ

ఆదిశంకర విద్యాసంస్థలు



వినాయక చవితి వచ్చేస్తోంది. ఊరూవాడా ఉత్సవాల సందడి మొదలు కాబోతోంది. ఈ తరుణంలో మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. మీరూ పర్యావరణ హితులైతే.. మీ ఇల్లు, అపార్ట్‌మెంట్ లేదా కాలనీలో మీరు నెలకొల్పిన మట్టి వినాయక విగ్రహంతో సెల్ఫీ తీసుకుని పంపించండి. 'సాక్షి' దినపత్రిక, ఆదిశంకర విద్యా సంస్థలు అందించే బహుమతిని గెలుచుకోండి. మీరు చేయాల్సిందల్లా మట్టి విగ్రహంతో సెల్ఫీ తీసుకుని 97054 44572 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించడమే. మీ చిరునామా, మొబైల్ నంబర్ తప్పనిసరిగా తెలియజేయండి. ఎంపిక చేసిన సెల్ఫీలను 'సాక్షి' ప్రచురిస్తుంది. ఉత్సవాలు ముగిసిన తరువాత మీ అందరి పేర్లను లక్కీ డిప్‌లో ఉంచి డ్రా తీస్తాం. విజేతలకు బహుమతులు అందజేస్తాం.

ఇంకెందుకు ఆలస్యం..
పర్యావరణానికి 'మట్టి' మేలు తలపెట్టండి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | బుధవారం | ఆగస్టు | 23 | 2017
సాక్షి

అప్పుడు క్రీడాకారుడిగా..
ఇప్పుడు క్రీడా ప్రోత్సాహకుడిగా

- క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణించిన కోటారెడ్డి
- జిల్లాలో క్రీడాకారుల కోసం ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ
- సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి కృషిచేస్తున్న వైనం


అప్పటి భారత్ కెప్టెన్ అజహరుద్దీన్‌తో మలిరెడ్డి (కుడివైపున)


ఒకప్పటి భారత మహిళా జట్టు కెప్టెన్ పూర్ణిమారావ్‌తో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) :

క్రికెట్ క్రీడాకారుడిగా రెండు దశాబ్దాలపాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభను చాటాడు నెల్లూరుకు చెందిన మలిరెడ్డి కోటారెడ్డి. పాఠశాల స్థాయి నుంచి క్రికెట్ పట్ల ఉన్న క్రేజ్‌తో 'రంజీ స్క్వాడ్'లో స్థానం సాధించాడు. ఇంటర్ యూనివర్సిటీ కెప్టెన్‌గా మూడుసార్లు ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని బ్లూస్టార్ టైటిల్‌ను పొందాడు. క్రీడాకారుడిగా తాను ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ తరం పడకూడదని క్రికెట్ క్రీడాకారులతోపాటు ఇతర క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాడు.

ఆల్‌రౌండర్‌గా..

కోటారెడ్డి క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ ప్రేరణతో క్రికెట్ పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. నెల్లూరులోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదివేప్పుడు మొదటిసారిగా క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 1985–86లో శ్రీకాకుళంలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటాడు. వీఆర్ కళాశాల నుంచి అండర్ 17, 19, 21, 22, 23, సీనియర్స్ టోర్నమెంట్‌లతోపాటు వివిధ పోటీల్లో ఆల్‌రౌండర్‌గా రాణించి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రికెట్‌తోపాటు అంతర్ కళాశాలల, విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీల్లో సైతం ప్రతిభను కనబరిచాడు.

సహాయంగా..

కోటారెడ్డి రంజీస్క్వాడ్‌లో శిక్షణ పొందారు. ఆసమయంలో తనతోపాటు రంజీ ట్రోఫీ శిక్షణ పొందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల పరిచయాలు కొనసాగిస్తున్నారు. వారి సహాయ సహకారాలతో జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి సహాయపడుతున్నాడు. అప్పటి కెప్టెన్ అజారుదీన్, నెక్కంటి వెంకట్రావ్, క్రీడాకారుడు ఎంఎస్‌కే ప్రసాద్, చాముండేశ్వరినాథ్‌లు మలిరెడ్డి క్రీడా ప్రతిభను అభినందించేవారు. ఈయన గతంలో నెల్లూరులో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రస్తుత భారత క్రికెట్ మహిళా టీమ్ కెప్టెన్ మిథాలీరాజ్ బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంది. అడ్వకేట్ అయిన మలిరెడ్డి జిల్లాలో ఇతర క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడిగా ఉన్నారు. రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా, స్టేట్ బోర్డ్ సెలక్టర్‌గా ఫ్రెండ్‌షిప్ కప్ పేరుతో ఐదేళ్ల క్రితం క్రికెట్ టోర్నీని నెల్లూరులో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు. 20 రోజుల పాటు పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడారులను గుర్తిస్తుంటారు. అలాగే జిల్లాలో క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించడంతో ప్రధాన భూమికను పోషిస్తున్నారు.

ప్లేయర్స్ పెరిగారు



జిల్లాలో అప్పటికంటే క్రీడాకారుల సంఖ్య పెరిగింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఆట పెరగాల్సిన అవసరం ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రాక్టీస్ చేయాలి. ఫ్లడ్‌లైట్స్‌లో ప్రాక్టీస్ చేసేందుకు గ్రౌండ్ కావాల్సి ఉంది. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.
– మలిరెడ్డి కోటారెడ్డి


రాష్ట్ర క్రికెట్ జట్టులో నిల్చున్న వారిలో కుడి నుంచి నాలుగో వ్యక్తి

వ్యర్థం కాదు.. అర్థం

వాడి పారేసే వస్తువులతో కళారూపాలు తీర్చిదిద్దిన గృహిణి





సూళ్లూరుపేట :

మనం వేస్ట్ అనుకునే వాటితో కళారూపాలు చేసి ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవచ్చని నిరూపించింది పట్టణానికి చెందిన గృహిణి సలువాది మల్లి విష్ణువందన. ఈమె వేస్ట్ మెటిరీయల్‌తో, మరికొంత సామగ్రి జోడించి రూపొందించిన వస్తువులు చూస్తే ఆశ్చర్యం కలగడం ఖాయం. వాడి పారేసిన అనేక రకాల వస్తువులను వినియోగించి దేవుడి మండపాలు రూపొందించి ఆకట్టుకుంటోంది. ప్లాస్టిక్, ఇతర వస్తువులను బయట పారేసి పర్యావరణాన్ని పాడు చేసే బదులుగా కళారూపాలు చేసి ఇంట్లో అందంగా అలంకరించుకోవచ్చని చెబుతోంది. ఆమె గతంలో బియ్యం గింజలపై అనేక కళాకృతులను రూపొందించి అందరి మన్ననలు పొందారు.

ఏ వస్తువులు రూపొందించారంటే..

థర్మాకోల్ డిస్పోజబుల్ ప్లేట్, జ్యూస్ తాగే స్ట్రాలు, వెల్వెట్ క్లాత్, బిగ్‌షాపర్ కవ్ర, అందమైన పూసలతో వినాయకుడికి గొడుగు తయారుచేసింది. థర్మాకోల్ డిస్పోజబుల్ ప్లేట్, పేపర్‌తో తయారుచేసిన టీకప్పులు, మెటాలిక్ పెయింట్, ఉలన్, రంగురంగుల పూసలు, కుందనలతో ఇంట్లో అందంగా షాండ్లియర్‌ను వేలాడదీసింది. విరిగిపోయిన గాజులు, పెండ్లిపిలుపు కార్డులపై ఉండే వినాయక బొమ్మలు, పెవికోల్, ఉలన్, కుందనలతో కలిపి గాజుల తోరణాన్ని తీర్చిదిదింది. వాడిపారేసిన సీడీ, చిన్నపాటి ప్లాస్టిక్ బాటిల్, మెటాలిక్ పెయింట్, స్టోన్‌లైయన్స్, కుందన్స్‌తో ఫ్లవర్‌వాజ్ తయారుచేశారు. విరిగిన కొబ్బరిచిప్పలు, వేస్ట్ సీడీ, కూల్ డ్రింక్ బాటిల్‌మూత, ముత్యాల్లాంటి పూసలు, డిజైనింగ్ వర్క్‌కు ఉపయోగించే లేస్‌తో బ్యాగ్‌ను పోలిన పూలబుట్ట తయారుచేసింది.



వినాయకుడి మండపం..

వినాయకచవితి సందర్భంగా వినాయకుడి ప్రతిమలను వెరైటీగా చూపించేలా అందమైన మండపం తయారుచేసింది విష్ణువందన. చిన్నబక్కెట్లపై ఉండే మూతలు, వాడిపారేసిన స్కెచ్‌పెన్నులు, జ్యూస్ బాటిల్ పైభాగం, క్యాన్‌వాస్, ఐ డ్రాప్స్ బాటిల్‌పై మూత, కుందన్స్, జెరీ అంచు, గ్లిట్టర్, మెటాలిక్ పెయింట్, గిఫ్ట్‌గా వచ్చే మనకు వచ్చే వివిధ దేవుళ్ల ప్రతిరూపాలతో మండపం రూపొందించారు. ఇందులో స్కెచ్‌పెన్నుల స్థానంలో సిరంజిలను కూడా వినియోగించుకోవచ్చు. దేవుడికి హారతి ఇచ్చేందుకు థర్మాకోల్ డిస్పోజబుల్ పెద్దప్లేట్, క్యాన్వాస్, వినాయకుని రూపాలు, కుందన్ పూలతో హారతి పళ్లెం తయారుచేసింది.



తక్కువ ఖర్చుతో చేయొచ్చు



ఇంటిని అలంకరించుకునేందుకు రూ.వేలు ఖర్చు చేస్తుంటారు. వేస్ట్ మెటీరియల్‌తో రూ.700 ఖర్చుతో కొన్ని కళారూపాలు చేసి ఇంటిని అలంకరించాను. దీని వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. – విష్ణువందన

సుబ్బరాయుడు కోలాటం అదుర్స్

- నాలుగు దశాబ్దాలుగా ప్రదర్శనలు ఇస్తున్న వైనం
- పదుల సంఖ్యలో శిష్య బృందాలు
- గ్రామాల్లో పెరుగుతున్న ఆదరణ


శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి గ్రామోత్సవంలో కోలాటం ప్రదర్శన

పొదలకూరు(సర్వేపల్లి) :


సంప్రదాయ కళలు క్రమంగా అంతరిస్తున్న రోజులివి. ఎక్కడో కొన్నిచోట్ల ప్రాచీన కళలను కొందరు కాపాడుకుంటూ వస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా తరగని ఆదరణతో కోలాటానికి ఖ్యాతి తీసుకువస్తున్నాడు చెన్నూరు సుబ్బరాయుడు(సుబ్బారెడ్డి). ఏడు పదుల వయస్సులోనూ లయతప్పకుండా ఆడుతూ అలరిస్తున్నాడు. శిష్యులను పోగేసి ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దైవకార్యాలకు సుబ్బారాయుడి కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సమైక్యాంధ్ర ఉద్యమంలో సుబ్బరాయుడు బృందం పాల్గొని తమ కోలాటం ద్వారా ఉద్యమానికి ఊతమిచ్చారు.

పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు వృత్తి వ్యవసాయం అయినప్పటికీ ప్రవృత్తి భజనలు, కోలాటం. తన సంప్రదాయ కోలాటం ద్వారా ఎన్నో ప్రశంశలు, బహుమతులను అందుకున్నారు. గురువు భిక్షాలదాసు ఇద్ద కోలాటం అభ్యశించిన సుబ్బరాయుడుకి మరొకరు ఆకుల చినగంగిరెడ్డి తోడై సుమారు 40 మంది శిష్య బృందంతో కోలాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా పొదలకూరు పట్టణానికి చెందిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి మహిళలకు సైతం శిక్షణ ఇచ్చారు. నిరంతర విద్యార్థిగా మెళకువలు, కొత్తరకం కోలాటాన్ని తెలుసుకుంటూ శిష్యులకు మెళకువలను నేర్పుతున్నారు.

మూడురకాల కోలాటాలు ప్రదర్శన..

సుబ్బరాయుడు, చినగంగిరెడ్డిలు మూడు రకాల కోలాటాలను ప్రదర్శిస్తుంటారు. సమయం, సందర్భం ఆయా గ్రామస్తుల అభిరుచి మేరకు ఇవి జరుగుతాయి. అడుగు కోలాటం, పుల్లకోలాటం, భజన కోలాటంలో వీరు సిద్ధహస్తులు. జడకోలాటం కూడా ఉన్నప్పటికీ వ్యవప్రయాసలతో కూడుకున్నది కావడంతో సుబ్బరాయుడు బృందం పెద్దగా ప్రదర్శించదు. సుబ్బరాయుడు ఇప్పటి వరకు 15 బృందాలకు కోలాటంలో శిక్షణ ఇచ్చారు. బృందానికి 40 మంది సభ్యులు ఉంటారు. ఈయనకు ప్రభుత్వం అందజేసిన గుర్తింపు కార్డు కూడా ఉంది. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీచైర్మన్‌గా ఉన్న సమయంలో సంప్రదాయ కళాకారుల కళలను ప్రదర్శింపజేసి వారికి ప్రశంసాపత్రం, నగదు పురస్కారాలను అందించారు. వారిలో ఈయన కూడా ఉన్నారు. పొదలకూరు యోగాకేంద్రం, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ తదితర సంస్థలు సుబ్బరాయుడుని సత్కరించాయి. కోలాటానికి ఇటీవల ఆదరణ పెరగడంతో ఈయన బృందం పక్క జిల్లాలకు కూడా వెళ్లి ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఊపిరి ఉన్నంత వరకు ప్రదర్శనలు



నా ఊపిరి ఉన్నంత వరకు కోలాటాన్ని శిష్య బృందంతో కలిసి ప్రదర్శిస్తూనే ఉంటాను. శిష్యులే నాకు కొండంత బలం. వారు ఎప్పుడు ఎక్కడకు పిలిచినా వస్తుంటారు. గురువుగా నన్ను గౌరవిస్తూ కళపై మక్కువ పెంచుకుంటున్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి దైవకార్యక్రమాలకు కోలాటం కావాలని అడుగుతున్నారు. ఆదరణ పెరుగుతున్నందుకు సంతోషంగా ఉంది.
– చెన్నూరు సుబ్బరాయుడు, కోలాటం గురువు


సుబ్బరాయుడి శిష్య బృందం

జన్మభూమిపై మమకారం..
గ్రామాభివృద్ధికి శ్రీకారం

ఆ యువకులు బాగా చదివి వివిధ నగరాల్లో స్థిరపడ్డారు. తమ సంపాదనలో కొంతైనా తల్లిలాంటి స్వగ్రామానికి వెచ్చించి అభివృద్ధి చేయాలని సంకల్పించారు. చేయిచేయి కలిపి 'దామేగుంట యూత్ ఫౌండేషన్'ను స్థాపించారు. ఇప్పటికే పలు కార్యక్రమాలు చేసి భవిష్యత్‌లో మరిన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు.


గిరిజనులకు దోమతెరలు, దుప్పట్లు ఇస్తున్న దృశ్యం

- ఫౌండేషన్ స్థాపించి దామేగుంటలో సేవా కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తున్న యువకులు



పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కొడవలూరు(కోవూరు): మండలంలోని దామేగుంట గ్రామం అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉంది. దీంతో గ్రామానికి చెందిన గల్లా కృష్ణ స్వగ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నడుం బిగించాడు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ గ్రామస్తులతో ఈ విషయం చర్చించాడు. వారు సానుకూలంగా స్పందించడంతో 2016 సంవత్సరంలో 40 మందితో దామేగుంట యూత్ ఫౌండేషన్‌ను స్థాపించారు. దీనికి గల్లా కృష్ణ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా మాచాల శ్రీనివాసులు, వక్కల మల్లికార్జున, కార్యదర్శిగా నక్కల శివకృష్ణ, సంయుక్త కార్యదర్శిలుగా పూట్ల సతీష్, ఉప్పునూరు వాసు, కోశాధికారిగా మధుసూధన్‌నాయుడు, మిగిలిన వారంతా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

ఏం చేశారంటే..

- ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ఫ్యాన్‌లు, బెంచీల ఏర్పాటు.
- తలమంచి రోడ్డు నుంచి దామేగుంటకు వెళ్లే ఒక కి.మీ రోడ్డు చీకటి పడితే అంధకారంగా ఉంటుండటంతో రోడ్డు పొడవునా ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు.
- గ్రామ శ్మశానం ఎప్పటినుంచో ఆక్రమణకు గురై ఉండగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణల తొలగింపు, మట్టితోలించి చదును చేయడం. బెంగళూరు నుంచి మొక్కలు తెప్పించి నాటడం.
- ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి అందజేయడం.
- గ్రామ గిరిజనకాలనీవాసులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ.

యువకుల సేవాభావం భేష్



గ్రామంలోని యువకులంతా ఒక తాటిపై నడుస్తూ సొంత నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేయడం అభినందనీయం. వారిని ప్రోత్సహించేందుకు సర్పంచ్‌గా నేను సిద్ధం.
– అనికేపల్లి వెంకటరత్నం, సర్పంచ్,దామేగుంట

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

2020 సంవత్సరం నాటికి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు ఒక ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తున్నాం. యువత ముందుకు వస్తేనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందనే అబ్దుల్‌కలాం సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నాం.
– డీవైఎఫ్ ఫౌండేషన్ సభ్యులు

రబీ సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయండి

▶ కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు(అర్బన్): రబీలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టర్ తన బంగ్లాలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారుల పనితీరుపై ఆయన సమీక్షించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు లేనందున రబీలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు భూసార పరీక్షల కార్డులు నూరు శాతం పంపిణీ చేయాలన్నారు. కార్డులను పంపిణీ చేయకుండా తప్పుడు నివేదికలు ఇస్తే ఏడీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిప్సం, జింక్‌సల్ఫేట్, బోరాన్‌ను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. పొజిషన్ ఉన్న సీజేఎఫ్‌ఎస్ భూముల రైతులకు రుణ అర్హత కార్డులు జారీ చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. జేసీ–2 వెంకటసుబ్బారెడ్డి, అగ్రికల్చర్ జేడీ చంద్రానాయక్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

భూసేకరణను వేగవంతం చేయాలి

జిల్లాలోని తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ, నీరు–ప్రగతి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాలువ పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ బాధితులకు పరిహారం అందించి భూసేకరణ పూర్తి చేయాలన్నారు.

సోమశిల ఉత్తర కాలువ, కావలి కాలువ పనులు పూర్తి చేయాలన్నారు. చుక్కల భూమిని గుర్తించి ఆక్రమణకు గురైన భూములను క్రమబద్ధీకరించేందుకు నీరు–చెట్టు కింద నిబంధనల ప్రకారం చేయని పనులు రద్దు చేయాలన్నారు. నీరు–ప్రగతి కింద 3765 పనులను రూ.418 కోట్లతో అనుమతించడం జరిగిందన్నారు. 1092 పనులు మాత్రమే పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులు సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి, తెలుగు గంగ ఎస్‌ఈ ఏవీ రమణ, ఇరిగేషన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.